మనం కరీంనగర్

జగిత్యాల- రాజన్న సిరిసిల్ల-పెద్దపల్లి-అసిఫాబాద్-మంచిర్యాల

బుధవారం | 4 | నవంబర్ | 2026 | పేజీలు 13 | www.manamepaper.com



అధిక ధరకు బియ్యం అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు

- సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, విద్యాసంస్థల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి
- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల,నవంబర్ 3 (మనం ప్రతినిధి) : అధిక ధరలకు బియ్యం విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని మంచిర్యాల పట్టణం మె-యిన్ రోడ్డులో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు లోబడి బియ్యం విక్రయాలు జరిపేందుకు వీలుగా శ్రీనాథ్ ట్రేడర్స్ వారు నూతనంగా ఏర్పాటు..

రోడ్డు ప్రమాదాల నివారణకు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలి



జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్.

ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు

అతివేగం, మద్యం సేవించి డ్రైవింగ్‌పై ప్రత్యేక నిఘా.

సీఎంఆర్ బకాయిల మాయాజాలం



ప్రభుత్వ ధాన్యం ఎక్కడ? బకాయిలు ఎన్ని కోట్లు?

జిల్లాలో సుమారు 84 రైస్ మిల్లులు.. 2024--25 లోనే 805 ఎస్కేల బాయిల్డ్ రైస్ బకాయి.!

ముస్తాబాద్‌లో ఒక్క మిల్లుకే 169 ఎస్కేలు.. విలువ సుమారు రూ.20 కోట్లు!.

పాత బకాయిలు తేల్చకుండా కొత్త ధాన్యం కేటాయింపులపై అనుమానాలు.

సివిల్ సప్లై అధికారుల తనిఖీలు, రికవరీ చర్యలపై ప్రజల్లో చర్చ

ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేస్తున్న ధాన్యాన్ని సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) రూపంలో తిరిగి ప్రభుత్వానికి అప్పగించాల్సిన బాధ్యత రైస్ మిల్లర్లపై ఉంది. అయితే రాజన్న సిరిసిల్ల జిల్లాలో సీఎంఆర్ బకాయిల వ్యవహారం ఆందోళన కలిగిస్తోంది.

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 03 (మనం ప్రతినిధి): గత సంవత్సరాలకు సంబంధించిన బకాయిలు ఎంత? మిల్లర్లు ప్రభుత్వానికి ఎంత బియ్యం అప్పగించారు? ఇంకా ఎన్ని ఎస్కేలు పెండింగ్‌లో ఉన్నాయి? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు రావాల్సి ఉంది. కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ బియ్యం బకాయిలుగా పేరుకుపోతున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో ఈ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది.

జిల్లాలో 84 రైస్ మిల్లులు.. బకాయిల లెక్కలెన్ని?.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో సుమారు 40 బాయిల్డ్ రైస్ మిల్లులు, 44 రా రైస్ మిల్లులు కలిపి మొత్తం 84 రైస్ మిల్లులు ఉన్నాయి, తెలుస్తుంది. వీటికి సంబంధించి ప్రభుత్వానికి అప్పగించాల్సిన సీఎంఆర్ బియ్యం లెక్కలు పూర్తిస్థాయిలో బయటకు రావాల్సి ఉంది. ముఖ్యంగా 2024--25 సంవత్సరానికి సంబంధించి బాయిల్డ్ రైస్ మిల్లర్ల నుంచి ప్రభుత్వానికి సుమారు 805 ఎస్కేల బియ్యం బకాయి ఉన్నట్లు సమాచారం. ఈ బకాయిల్లో ఇప్పటివరకు ఎంత మేరకు వసూలు చేశారు? ఇంకా ఎంత పెండింగ్‌లో ఉంది? అనే వివరాలను అధికారులు వెల్లడించాల్సి ఉంది.

ముస్తాబాద్‌లో ఒక్క మిల్లుకే 169 ఎస్కేలు.. రూ.20 కోట్ల బకాయా?.

2025--26 సంవత్సరానికి సంబంధించి ముస్తాబాద్ మండల కేంద్రంలోని ఒక రైస్ మిల్లుకు ప్రభుత్వానికి అప్పగించాల్సిన సీఎంఆర్ బియ్యం సుమారు 169 ఎస్కేలు బకాయి ఉన్నట్లు సమాచారం. దీని విలువ సుమారు రూ.20 కోట్ల వరకు ఉంటుందని అంచనాలు వినిపిస్తున్నాయి. ఒక్క రైస్ మిల్లులోనే ఇంత భారీ మొత్తంలో బకాయిలు ఉన్నాయన్న సమాచారం నిజమైతే జిల్లాలోని మిగతా మిల్లుల పరిస్థితి ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. జిల్లాలోని 84 రైస్ మిల్లులకు సంబంధించి 2024--25, 2025--26 సంవత్సరాల వారీగా కేటాయించిన ధాన్యం, అప్పగించిన సీఎంఆర్ బియ్యం, మిగిలిన బకాయిల వివరాలను అధికారులు బహిర్గతం చేస్తే ప్రభుత్వానికి రావాల్సిన అసలు బకాయిల పరిమాణం స్పష్టమవుతుంది.

ఇంటికో ఇంకుడు గుంత.. ప్రతి పొలానికీ కుంట



నకిలీ కస్టమర్ కేర్, పెట్టుబడి మోసాలు, స్క్రీన్ షేరింగ్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

జగిత్యాల జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్



జగిత్యాల నవంబర్ 3(మనం ప్రతినిధి) : యువర్ మనీ యువర్ క్లాక్ యువర్ ఛాయిస్ నినాదంతో నవంబర్ నెల మొత్తం జిల్లా వ్యాప్తంగా సైబర్ అవగాహన కార్యక్రమాలు సైబర్ నేరాల నివారణపై అవగాహన పోస్టర్లను ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ సైబర్ ఆర్థిక నేరాలను అరికట్టి ప్రజల్లో సురక్షితమైన డిజిటల్ లావాదేవీలపై అవగాహన పెంపొందించేందుకు నవంబర్ నెల మె-ఎత్తం జగిత్యాల జిల్లా వ్యాప్తంగా యువర్ మనీ యువర్ క్లిక్ యువర్ ఛాయస్ అనే ప్రధాన ఇతివృత్తంతో ఫ్యూజ్ ద పేమెంట్ వెరిఫై ద పర్సన్ అనే నినాదంతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్, ఐపీఎస్ తెలిపారు. ఈ సందర్భంగా..

నకిలీ కస్టమర్ కేర్, పెట్టుబడి మోసాలు, స్క్రీన్ షేరింగ్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

జిల్లా పోలీస్ కార్యాలయంలో సైబర్ నేరాల నివారణకు సంబంధించిన అవగాహన పోస్టర్లను ఎస్పీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ నేరగాళ్లు నిత్యం కొత్త పద్ధతులను అనుసరిస్తూ ప్రజలను ఆర్థిక మోసాలకు గురిచేస్తున్నారని, ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్ లావాదేవీల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించే ముందు క్షణం ఆగి, డబ్బులు స్వీకరించే వ్యక్తి లేదా సంస్థ వివరాలను పూర్తిగా ధృవీకరించుకోవాలని తెలిపారు.ముఖ్యంగా ఆన్‌లైన్ ప్రకటనల ద్వారా వస్తువులు, సేవలు అందిస్తామని నమ్మించి డబ్బులు వసూలు చేసి వస్తువులు డెలివరీ చేయకుండా మోసాలకు పాల్పడటం, వ్యక్తిగత వివరాలను దొంగిలించి క్రెడిట్, డెబిట్ కార్డులను అనధికారికంగా వినియోగించడం, స్టాక్ మార్కెట్‌లో అధిక లాభాలు వస్తాయని ఆశ చూపుతూ నకిలీ పెట్టుబడి పథకాల పేరుతో మోసం చేయడం వంటి సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా నకిలీ కస్టమర్ కేర్ నంబర్లను నమ్మి సంప్రదించవద్దని, గూగుల్ లేదా సోషల్ మీడియాలో కనిపించే ప్రతి కస్టమర్ కేర్ నంబర్ నిజమైనదని భావించవద్దని తెలిపారు. అపరిచితుల సూచనల మేరకు స్క్రీన్ షేరింగ్ యాప్‌లను ఇన్‌స్టాల్ చేయవద్దని, ఓటీపీ, యూపీఐ పిన్, బ్యాంకు ఖాతా వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని స్పష్టం చేశారు. అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకుండా, చెల్లింపుల సమయంలో లబ్ధిదారుల పేరు, ఖాతా వివరాలను సరిచూసుకోవాలని సూచించారు.ఎవరైనా సైబర్ ఆర్థిక మోసానికి గురైనట్లయితే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేయాలని లేదా ఎఎఎవతీఎతీఅఎవ.స్రశీజ.అఅ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు. మోసం జరిగిన వెంటనే ఫిర్యాదు చేయడం ద్వారా మోసపోయిన నగదును నిలువరించే అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. ఈ యొక్క కార్యక్రమం లో రిజర్వ్ ఇన్స్పెక్టర్ వేణు, సైబర్ క్రైమ్ ఎస్.ఐ కృష్ణ, సైబర్ క్రైమ్ సిబ్బంది పాల్గొన్నారు.

అధిక సాంద్రత పత్తి సాగుతో ఎకరాకు 15 క్వింటాళ్ల దిగుబడి

మందమర్రి, నవంబర్ 3:(మనం న్యూస్) అధిక సాంద్రత పత్తి సాగుతూ ఎకరాకు 15 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అందుగుల పేట గ్రామానికి చెందిన రైతు ఏనుగు ఆసిరెడ్డి తెలపడంతో సంతృప్తి వ్యక్తం చేసిన కాటన్ డెవలప్మెంట్ డైరెక్టర్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ప్రియాంక గైక్వాడ్. మంగళవారం మంచిర్యాల జిల్లా మందమర్రి మండలంలోని కేంద్ర ప్రభుత్వ కపాస్ క్రాంతి పథకం మిషన్ ఫర్ కాటన్ ప్రొడక్టివిటీ కార్యక్రమంలో భాగంగా అందుగుల పేట గ్రామంలో రైతు ఏనుగు ఆసిరెడ్డి సాగు చేసిన పత్తి చేను సందర్శించి సాగు విధానం, పంట ఎదుగుదల,దిగుబడి అంచనాల గురించి రైతులు అడిగి తెలుసుకున్నారు. పంట పరిస్థితి ఆశజనకంగా ఉందని ఎకరాకు 10 నుంచి సుమారు 15 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉందని రైతులు వివరించడంతో శాస్త్రవేత్త సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలోని పత్తి రైతులందరూ “అధిక సాంద్రత సాగు విధానాన్ని” అనుసరించి అధిక దిగుబడులు సాధించాలని ఆయన సూచించారు నీటిలో కరిగే స్తూల, సూక్ష్మ పోషకాలను వినియోగించడంతో పాటు రసం పీల్చే పురుగుల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. మెపీక్యాట్, క్లోరైడ్ వినియోగంతో మొక్కల ఎదుగుదలను నియంత్రించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చు అని తెలిపారు. ఎకరాకు సుమారు 24 వేల మొక్కలను నాటి ఒక్క మొక్కకు పది నుంచి 15 కాయలు వచ్చినప్పటికీ, ఎకరాకు పది నుంచి 15 కింటాల వరకు దిగుబడి సాధించే అవకాశం ఉందని వివరించారు. అధిక సాంద్రత పత్తి సాగు ద్వారా కలిగే ప్రయోజనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, వచ్చే ఏడాది వానకాలం సీజన్లో ఈ సాగు విధానాన్ని విస్తృతంగా చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎల్తూరి సురేఖ,ఏడీఏ బానోతు ప్రసాద్, మందమర్రి మండల వ్యవసాయ అధికారి జి. కిరణ్మయి, ఏ ఈ ఓ కనకరాజు పలువురు రైతులు పాల్గొన్నారు.



అధిక ధరకు బియ్యం అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

చేసిన బియ్యం అమ్మకాల అవుట్ లెట్ ను ఇన్చార్జి జిల్లా పౌర సరఫరాల అధికారి, సంబంధిత అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ట ధరలకు మించి అమ్మకాలు జరుపకూడదని, నిబంధనలను ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. బి.పి.టి, హెచ్.ఎం.టి. తదితర రకాల బియ్యంను ప్రభుత్వ నిర్దేశిత ధరలకు అందించేందుకు గజానన్ ఇండస్ట్రీస్ ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. ఎల్ నినో ప్రభావం వల్ల ప్రస్తుతం మార్కెట్ లో నెలకొని ఉన్న పరిస్థితుల నేపథ్యంలో బియ్యం వ్యాపారులు, ట్రేడర్లు అందరూ మానవతా దృక్పథంతో వ్యవహరిస్తూ ప్రజలకు బియ్యం ధరలను అందుబాటులో ఉంచాలని, ప్రభుత్వ నిర్ణీత ధరకే విక్రయాలు జరిగేలా రెవెన్యూ, పౌర సరఫరాల శాఖల అధికారులతో ఆకస్మిక తనిఖీల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని, తనిఖీల కోసం వచ్చే బృందాలకు వ్యాపారులు, ట్రేడర్లు సహకరించాలని తెలిపారు. 26 కిలోల బరువుతో కూడిన ప్రీమియం క్వాలిటీ బి.పి.టి. రా రైస్ బ్యాగ్ ను 1430 రూపాయలు, హెచ్.ఎం.టి స్టీమ్ రకం బియ్యం బస్తా 1898 రూపాయల చొప్పున అవుట్ లెట్ ద్వారా నిబంధనల ప్రకారం విక్రయాలు జరుపుతామని నిర్వాహకులు తెలిపారు. పట్టణంలోని చున్నంబట్టివాడ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ నర్సింగ్ కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలించి, పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. జైపూర్ మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర విద్యాలయాన్ని సందర్శించి తరగతి గదులు, వంటశాల, విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యతను పరిశీలించారు. నిర్ణీత మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని, హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేసి ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విధులకు హాజరు కావాలని సూచించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి వంటశాలను పరిశీలించారు. విద్యార్థినులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ఇంటర్మీడియట్ ఎంపిసి విద్యార్థులకు గణిత బోధన జరుగుతున్న తీరును పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యాసన సామర్థ్యాలను తెలుసుకున్నారు. విద్యార్థినులకు మంజూరైన పడకలు, పరుపులను పరిశీలించి, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. అనంతరం చెన్నూర్ మున్సిపాలిటీలో అమృత్ 2.0 పథకం క్రింద చేపడుతున్న అభివృద్ధి పనులను మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ తో కలిసి పరిశీలించి, పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. చెన్నూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేసి, ఉపాధ్యాయులు సమయానికి విధులకు హాజరుకావాలని సూచించారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదుల పనులను పరిశీలించారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. వంటశాలను పరిశీలించి విద్యార్థినులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలి

జగిత్యాల నవంబర్ 3(మనం ప్రతినిధి) : జగిత్యాల జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారులతో పాటు రాష్ట్ర, ఇతర రహదారులపై ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి, ప్రమాదాలకు గల కారణాలను విశ్లేషించి శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు, రోడ్డు ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలు, జాతీయ రహదారులపై భద్రతా పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గత మూడు నెలలుగా జరిగిన రోడ్డు ప్రమాదాలపై సమగ్ర విశ్లేషణ చేసి, ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి వచ్చే వారం నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసు, ఎన్‌హెచ్ఏఐ, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ శాఖల అధికారులు సంఘటనా స్థలాన్ని సందర్శించి ప్రమాదానికి గల కారణాలను గుర్తించాలని సూచించారు.

అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు, రంబుల్ స్ట్రిప్స్, వేగ నియంత్రణ బోర్డులు, హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేయడంతో పాటు రోడ్డు భద్రత పనులకు అవసరమైన నిధుల అంచనాలు సిద్ధం చేయాలని తెలిపారు. జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి సారించాలని, రాత్రివేళల్లో వాహనదారులకు స్పష్టంగా కనిపించేలా రిఫ్లెక్టివ్ సూచిక బోర్డులు, రోడ్ మార్కింగ్‌లు, చెవ్రాన్ మార్కర్లు, రోడ్ స్టడ్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బ్లాక్ స్పాట్ల వద్ద ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని, రోడ్ల వెంట ఆక్రమణలు తొలగించి అనధికార పార్కింగ్‌ను నియంత్రించాలని తెలిపారు.

జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం కారణంగానే అధిక శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల్లో ఎక్కువగా గాయపడుతున్నారని, హెల్మెట్ ధరించకపోవడం వల్ల తలకు తీవ్ర గాయాలై ప్రాణనష్టం సంభవిస్తోందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు, అతివేగ నియంత్రణ చర్యలను మరింత విస్తృతం చేస్తున్నామని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలను గుర్తించి నియంత్రించేందుకు ఏఐ ఆధారిత కెమెరాల ఏర్పాటు అవసరమని, పట్టణ ప్రాంతాల్లో సీసీ కెమెరాల ద్వారా ట్రాఫిక్‌ను నిరంతరం పర్యవేక్షిస్తూ నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై ఈ-చలాన్లు జారీ చేసే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ట్రాఫిక్ విధులు నిర్వహించే పోలీసు సిబ్బందికి భద్రతా జాకెట్లు, బారికేడ్లు, హెల్మెట్లు తదితర రక్షణ పరికరాలు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షిత ప్రయాణం చేయాలని ఎస్పీ సూచించారు. అనంతరం జాతీయ రహదారులపై ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు సకాలంలో వైద్య సేవలు అందించేందుకు ఎన్‌హెచ్ఏఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబులెన్స్ సేవలను జిల్లా కలెక్టర్, ఎస్పీ ప్రారంభించారు. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను సమీప ఆసుపత్రులకు తరలించి విలువైన ప్రాణాలను కాపాడేలా అత్యవసర స్పందన వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. జాతీయ రహదారులపై అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు ఎన్‌హెచ్ఏఐ టోల్ ఫ్రీ నంబర్ లి1033లికు సమాచారం అందించాలని అధికారులు తెలిపారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్. ప్రసూనాంభా, ఎన్‌హెచ్ఏఐ అధికారులు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, పోలీసు, రవాణా, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య శాఖ, ఆర్టీసీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇంటికో ఇంకుడు గుంత.. ప్రతి పొలానికీ కుంట

'జలసిరి'"తో ప్రతి వర్షపు చుక్కనూ ఒడిసి పట్టాలి.....

కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్ర

కరీంనగర్ నవంబర్ 03(మనం బ్యూరో)...ప్రతి ఇంటికీ ఇంకుడు గుంత, ప్రతి పొలానికీ పంటకుంట తవ్వడం ద్వారా భవిష్యత్తులో నీటి ఎద్దడిని నివారించవచ్చని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సూచించారు. జలసిరి కార్యక్రమం ద్వారా ప్రతి నీటి చుక్కను ఒడిసి పట్టాలని అధికారులను ఆదేశించారు. కొత్తపల్లి మండలంలోని బద్దిపల్లిలో వివి జి రాంజీ కార్యక్రమం ద్వారా నిర్మించిన కమ్యూనిటీ వ్యవసాయ ఇంకుడు గుంతను, నాగుల మల్యాల గ్రామంలో రైతు ఎడ్ల లత పొలం వద్ద నిర్మించిన పంట కుంటను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూగర్భ జలాల పెంపుదల, నీటి సంరక్షణ ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం జలసిరి కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు. జిల్లాలో ఈ కార్యక్రమం కింద గుంతల నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయని అన్నారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచడం ద్వారా భవిష్యత్తులో నీటి కరువు రాకుండా చూడవచ్చని అన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో ఇండ్ల వద్ద ఇంకుడు గుంతలు, పంట పొలాల వద్ద పంట కుంటలు, ప్రభుత్వ భూముల్లో కమ్యూనిటీ వ్యవసాయ ఇంకుడు గుంతల నిర్మాణం శరవేగంగా సాగుతోందని తెలిపారు. వివి జి రాంజీ కార్యక్రమం ద్వారా ఈ పనులు చేపడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు పెద్ద ఎత్తున ఉపాధి కల్పిస్తున్నామని తెలిపారు. జలసిరి ద్వారా నీటి వనరులు పెంపొందించేందుకు, రైతులకు మరింత మేలు చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఎల్ నినో నేపథ్యంలో జలసిరి కార్యక్రమం ద్వారా ఇంకుడు గుంతలు, పంట కుంటలు, బోరు బావుల రీఛార్జి పనులను చేపట్టామని, వీటిని నిర్మించుకునేందుకు రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున ముందుకు రావాలని సూచించారు. సర్పంచులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమం పై గ్రామస్తులకు విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు. గ్రామాల్లో నిర్మించే కమ్యూనిటీ ఇంకుడు గుంతల్లో చేపల పెంపకాన్ని కూడా ప్రోత్సహిస్తామని తెలిపారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సందర్శన

కొత్తపల్లి మండలం ఆసిఫ్ నగర్ లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. సిబ్బంది వివరాలు, వైద్య సేవలు, మందుల లభ్యతను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు కేంద్రానికి వస్తున్న రోగుల సంఖ్య, ఆరోగ్య పరీక్షల గురించి వైద్య సిబ్బందిని ప్రశ్నించారు. గ్రామస్తులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.

తెలంగాణ మోడల్ స్కూల్, కేజీబీవీ సందర్శన

కొత్తపల్లి మండలం ఎలగందుల గ్రామంలోని తెలంగాణ మోడల్ స్కూల్, కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయాన్ని కలెక్టర్ సందర్శించారు. పాఠశాలలో విద్యా ప్రమాణాలు, బాలికలకు కల్పిస్తున్న వసతులు, భోజన సదుపాయం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

పక్కా భవనాలకు భూ కేటాయింపులు పూర్తి చేయాలి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఇతర ప్రభుత్వ భవనాల నిర్మాణానికి పెండింగ్లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించి భూ కేటాయింపు ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఆర్డీవో, తహసిల్దార్, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ఈ ప్రక్రియను వారం రోజుల్లోగా పూర్తి చేయాలని అన్నారు. అదేవిధంగా ఎలగందల్ మోడల్ స్కూల్, కేజీబీవీల్లో శానిటేషన్ మెరుగుపరచాలని అన్నారు. విద్యార్థుల కోసం కావలసిన అవసరాలు, సౌకర్యాలు, అవసరమైన మరమ్మతులకు సంబంధించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి ఎంపీడీవో శ్రీనివాస్, ఎం ఏ ఓ సంతోష్, మండల ప్రత్యేక అధికారి రణధీర్ కుమార్, హార్టికల్చర్ ఆఫీసర్ స్వాతి, ఇంజనీర్ స్పందన, విద్యాశాఖ కోఆర్డినేటర్ మిల్కూరి శ్రీనివాస్, ఎంఏవో ఆనందం, ప్రిన్సిపాల్ లు రమాదేవి, కే శ్రీనివాస్, సర్పంచులు శ్రీనివాస్, అంజయ్య, చంద్రకళ, నిమ్మల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ, అసమానతలు లేని సమాజం కోసం యువత సంఘటితం కావాలి



జమ్మికుంట, నవంబర్ 3 (మనం న్యూస్): భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం జమ్మికుంట మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డివైఎఫ్ఐ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్ పటేల్ సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యువజన ఉద్యమ ప్రస్థానాన్ని, సంఘం ఆవిర్భావ లక్ష్యాలను, యువత హక్కుల సాధన కోసం నిర్వహించిన పోరాటాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా నరేష్ పటేల్ మాట్లాడుతూ... 1980 నవంబర్ 1, 2, 3న పంజాబ్ రాష్ట్రంలోని లూథియానాలో దేశవ్యాప్తంగా ఉన్న వివిధ యువజన సంఘాల ఐక్యతతో భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య ఆవిర్భవించిందని తెలిపారు. దేశంలోని యువతను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, యువత ఎదుర్కొంటున్న సమస్యలపై ఐక్యంగా పోరాడటంతో పాటు ప్రజాస్వామిక, లౌకిక, సమానత్వ విలువలతో కూడిన సమాజ నిర్మాణం కోసం ఈ సంఘం ఏర్పడిందని వివరించారు. 47 సంవత్సరాల సుదీర్ఘ ప్రస్థానంలో డివైఎఫ్ఐ అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటూ యువత హక్కుల కోసం నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోందని అన్నారు. నిరుద్యోగం, విద్య, ఉపాధి, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ వంటి అంశాలపై దేశవ్యాప్తంగా అనేక ఉద్యమాలు నిర్వహించి యువత గొంతుకగా నిలుస్తోందని పేర్కొన్నారు. యువతను కేవలం ఉద్యోగాల కోసం ఎదురుచూసే వారిగా కాకుండా సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు, దోపిడీ, వివక్షపై ప్రశ్నించే చైతన్యవంతమైన పౌరులుగా తీర్చిదిద్దడమే డివైఎఫ్ఐ లక్ష్యమని తెలిపారు. నేటి సమాజంలో నిరుద్యోగ సమస్య యువత భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం లక్షలాది మంది విద్యార్థులు చదువులు పూర్తి చేసుకుని ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నప్పటికీ తగిన ఉపాధి అవకాశాలు లభించడం లేదన్నారు. ప్రభుత్వ శాఖల్లో వేలాది ఉద్యోగాలు ఖాళీగా ఉన్నప్పటికీ వాటిని భర్తీ చేయడంలో పాలక ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు. ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన ఉద్యోగ హామీలను అమలు చేయాలని, ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలన్నింటినీ తక్షణమే భర్తీ చేయాలని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాలని, పేద విద్యార్థులందరికీ నాణ్యమైన విద్య అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్య, వైద్యం, ఉపాధి అనేవి ప్రతి ఒక్కరికీ అందాల్సిన ప్రాథమిక హక్కులని, అవి కొద్దిమందికే పరిమితమయ్యే పరిస్థితి మారాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు జేశ్వంత్.నాయకులు రంజిత్.సిద్ధార్థ్, రోహిత్, రిజ్వాన్,రియాన్,రామ్,నితిన్,నాగరాజు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ బకాయిల మాయాజాలం

(మొదటి పేజీ తరువాయి)

"ప్రభుత్వ బకాయిలు ఒకవైపు.. ప్రైవేటు ఆస్తులు మరోవైపు!.

ప్రభుత్వానికి అప్పగించాల్సిన సీఎంఆర్ బియ్యం బకాయిలు పేరుకుపోతున్నప్పటికీ కొందరు మిల్లర్లు ప్రైవేటు వ్యాపారాలు, ఆస్తుల కొనుగోళ్లలో నిమగ్నమవుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ బకాయిల వసూళ్ల విషయంలో అధికారులు ఎందుకు కఠినంగా వ్యవహరించడం లేదన్న విమర్శలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ ఆరోపణల్లో వాస్తవాలను సంబంధిత శాఖ అధికారులు విచారణ ద్వారా నిర్ధారించాల్సి ఉంది.ప్రభుత్వం ఎప్పటికప్పుడు కొత్త నిబంధనలు, మార్గదర్శకాలు, ఉత్తర్వులు జారీ చేస్తున్నా సీఎంఆర్ బకాయిల సమస్యకు శాశ్వత పరిష్కారం ఎందుకు లభించడం లేదన్నది ప్రశ్నార్థకంగా మారింది. బకాయిలున్న మిల్లుల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారా? మిల్లర్ల ఆస్తులు, నిల్వలు, ధాన్యం లెక్కలను పరిశీలిస్తున్నారా? ప్రభుత్వానికి రావాల్సిన బియ్యాన్ని రికవరీ చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

కొత్త ధాన్యం చేతికి వచ్చింది.. పాత బకాయిల సంగతేంటి?.

ప్రస్తుతం కొత్త పంట చేతికి వస్తున్న నేపథ్యంలో 2025--26 సంవత్సరానికి సంబంధించిన ధాన్యం సేకరణ, మిల్లులకు కేటాయింపుల ప్రక్రియపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. గత సంవత్సరాల సీఎంఆర్ బకాయిలు పూర్తిగా తేలకుండానే మళ్లీ అదే మిల్లులకు ధాన్యం కేటాయిస్తారా? ఇప్పటికే బకాయిలు ఉన్న మిల్లుల్లో కొత్త ధాన్యాన్ని నిల్వ చేయడానికి అనుమతిస్తారా? ప్రభుత్వానికి రావాల్సిన పాత బియ్యం రికవరీ కాకపోతే కొత్త ధాన్యం భద్రతకు ఎవరు బాధ్యత వహిస్తారు? అన్న ప్రశ్నలు రైతులు, ప్రజల్లో చర్చకు దారితీస్తున్నాయి.

సివిల్ సప్లై అధికారుల నిర్లక్ష్యమా? పర్యవేక్షణ లోపమా?.

సిరిసిల్ల జిల్లాలోని సుమారు 84 రైస్ మిల్లుల సీఎంఆర్ లెక్కలపై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ప్రతి మిల్లులో ధాన్యం నిల్వలు, బియ్యం ఉత్పత్తి, ప్రభుత్వానికి అప్పగించిన సీఎంఆర్, మిగిలిన బకాయిలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలి. బకాయిలు ఉన్న మిల్లర్లపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వానికి రావాల్సిన ప్రతి ఎస్కే బియ్యాన్ని రికవరీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోవాలి.. బకాయిలపై శ్వేతపత్రం విడుదల చేయాలి.

రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్, జిల్లా పౌరసరఫరాల అధికారి ఈ వ్యవహారంపై ప్రత్యేక విచారణ చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. 2024--25, 2025--26 సంవత్సరాలకు సంబంధించి ప్రతి రైస్ మిల్లుకు కేటాయించిన ధాన్యం, ప్రభుత్వానికి అప్పగించిన బియ్యం, మిగిలిన సీఎంఆర్ బకాయిల వివరాలను బహిర్గతం చేయాలి. ముస్తాబాద్లోని ఒక మిల్లుకు సంబంధించిన 169 ఎస్కేల బకాయి అంశంపైనా పూర్తిస్థాయి విచారణ జరపాలి. ప్రభుత్వ ధాన్యం ప్రజల సొత్తు. దాని విలువ కోట్ల రూపాయల్లో ఉన్నప్పుడు బాధ్యతాయుతమైన పర్యవేక్షణ తప్పనిసరి. బకాయిలు పేరుకుపోతున్నా చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో ప్రభుత్వానికి మరింత నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. అసలు బకాయిలు ఎన్ని? వాటికి బాధ్యులెవరు? ఎప్పటిలోగా వసూలు చేస్తారు? కొత్త ధాన్యం కేటాయింపులకు ఎలాంటి నిబంధనలు పాటిస్తారు? అనే ప్రశ్నలకు పౌరసరఫరాల శాఖ అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఉపాధి హామీ సిబ్బందికి శిక్షణ

కాసిపేట, నవంబర్ 3(మనంన్యూస్)కాసిపేట మండల పరిషత్ కార్యాలయం సమావేశం హాలు యందు మంగళవారం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పతకం సిబ్బందికి పలు అంశాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎం ఎంఎస్ యాప్ ద్వారా కూలీల హాజరు నమోదు, మస్టర్ రోల్ తయారు,నిర్వహణ, సిబ్బంది, అధికారుల విధులు,బాధ్యతలు,పనులకు సంబంధించిన కొలతలు, వాటి నమోదు, ఎంబి నిర్వహణ, వేతనాల చెల్లింపు, వివి జి రామ్ జీ చట్టం,తదితర అంశాలపై ఎంపీడీఓ సత్యనారాయణ సింగ్, ఏపీఓ నవీన్ కుమార్, ఈసి మల్లేశ్, టిఏ లు అవగాహన కల్పించారు. పతకం అమలు లో పారదర్శకత ,జవాబుదారితనం,పెంపొందించి నిబంధనల మేరకు పనులు నిర్వహించాలని,ఎక్కడ అక్రమాలకు చోటివ్వరాదని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సర్దార్ అలీ,సీనియర్ సహాయకులు లక్ష్మీనారాయణ, మెట్ లు పాల్గొన్నారు.



సీసీఐ నిబంధనలను సడలించాలి

-తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వర్ణ వెంకట్ రెడ్డి

జమ్మికుంట, నవంబర్ 3 (మనం న్యూస్):ఎల్‌నినో ప్రభావంతో ఈ సంవత్సరం పత్తి పంట దిగుబడి గణనీయంగా తగ్గిపోయిందని, సాధారణంగా ఎకరాకు 10 నుంచి 15 క్వింటాళ్ల పత్తి దిగుబడి రావాల్సి ఉండగా, ప్రస్తుతం కేవలం 3 నుంచి 5 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వస్తోందని, క్వింటాల్ కు రూ.15,000 మద్దతు ధర ను ప్రకటించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వర్ణ వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. జమ్మికుంట పత్తి మార్కెట్ యార్డును మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ... ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ మార్పులు, వర్షాభావ పరిస్థితుల కారణంగా ఇప్పటికే తీవ్రంగా నష్టపోయిన పత్తి రైతులను కేంద్ర ప్రభుత్వ విధానాలు మరింత సంక్షోభంలోకి నెడుతున్నాయని విమర్శించారు. సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) 8 నుంచి 12 శాతం తేమ ఉన్న పత్తిని మాత్రమే మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని ప్రకటించడం రైతాంగాన్ని మోసం చేయడమేనని అన్నారు. పంట దిగుబడి తగ్గి, పెట్టుబడులు కూడా తిరిగి రాని పరిస్థితుల్లో తేమ శాతం నిబంధనల పేరుతో రైతుల పత్తిని కొనుగోలు చేయకపోవడం అన్యాయమన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వెంటనే సీసీఐ కొనుగోలు నిబంధనలను సడలించి 15 శాతం వరకు తేమ ఉన్న పత్తి ఉత్పత్తులను కూడా మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం అమలులో ఉన్న పత్తి కనీస మద్దతు ధర రైతులకు ఏమాత్రం గిట్టుబాటు కావడం



లేదని, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో రైతులకు పెట్టుబడులపై తగిన ఆదాయం లభించడం లేదన్నారు. అందువల్ల పత్తికి క్వింటాలుకు రూ.15,000 కనీస మద్దతు ధర ప్రకటించి, ప్రభుత్వమే పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో పత్తి కొనుగోలు సీజన్ ప్రారంభమైనప్పటికీ నేటి వరకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఒక్క క్వింటా పత్తిని కూడా మద్దతు ధరకు కొనుగోలు చేయకపోవడం కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. సీసీఐ వెంటనే కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిలో ప్రారంభించి, రైతుల నుంచి ఎలాంటి షరతులు, ఇబ్బందులు లేకుండా పత్తిని కొనుగోలు చేయాలని కోరారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం పత్తి దిగుమతులపై దిగుమతి సుంకాన్ని ఎత్తివేయడం వల్ల విదేశాల నుంచి తక్కువ ధరకు పత్తి దిగుమతి అవుతోందని, దీంతో దేశీయంగా పత్తి పండిస్తున్న రైతులకు సరైన ధర లభించడం లేదని పేర్కొన్నారు. దేశీయ పత్తి రైతుల ప్రయోజనాలను కాపాడాలంటే దిగుమతి సుంకాలను తిరిగి విధించడంతో పాటు అవసరమైన మేరకు పెంచాలని డిమాండ్ చేశారు. కప్పాస్ కిసాన్ యాప్ ద్వారా పత్తి విక్రయాలకు సంబంధించి రైతులు ఎదుర్కొంటున్న సాంకేతిక, ఆచరణాత్మక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఆ యాప్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సాంకేతిక పరిజ్ఞానంపై పూర్తి అవగాహన లేని చిన్న, సన్నకారు రైతులు యాప్ నిబంధనల వల్ల ఇబ్బందులు పడుతున్నారని, పత్తి విక్రయ ప్రక్రియను సరళతరం చేసి రైతులకు నేరుగా కొనుగోలు కేంద్రాల్లో విక్రయించే అవకాశం కల్పించాలని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని, రైతులకు అండగా ఉంటామని చెబుతూ ఆచరణలో రైతాంగాన్ని సంక్షోభంలోకి నెట్టే విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు. రైతుల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్న బీజేపీ ప్రభుత్వ ద్వంద్వ నీతిని గ్రామగ్రామాన రైతాంగం ఐక్యంగా ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం రైతుల వాస్తవ పరిస్థితులను గుర్తించి సీసీఐ నిబంధనలను సడలించాలని, 15 శాతం తేమ వరకు పత్తిని కొనుగోలు చేయాలని, క్వింటాలుకు రూ.15 వేల మద్దతు ధర ప్రకటించాలని, పత్తి దిగుమతి సుంకాన్ని తిరిగి విధించాలని, కప్పాస్ కిసాన్ యాప్‌ను రద్దు చేయాలని వర్ణ వెంకట్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు తెలంగాణ రైతాంగం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి చేల్పూరి రాము, మండల అధ్యక్ష కార్యదర్శులు కాయిత లింగారెడ్డి, శీలం అశోక్, జిల్లా కమిటీ సభ్యులు తిప్పర బోయిన శ్రీకాంత్, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వడ్లూరి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ బెల్లంపల్లి కోర్టు కమిటీ ఎన్నిక



బెల్లంపల్లి, నవంబర్ 3, (మనం న్యూస్) : ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ బెల్లంపల్లి కోర్టు కమిటీ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా న్యాయవాది మాసు సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా మురళి శ్రావణ్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా జాడి రాజేష్, దేవరాజ్, సహాయ కార్యదర్శులుగా అనిల్ కుమార్, జూబేర్, కోశాధికారిగా కుమార్, కమిటీ సభ్యులుగా గొర్లపల్లి రమేష్, సజ్జనపు సంతోష్, కందుల సందీప్, బుర్సా రమేష్, దాట్ల సతీష్, మద్దిబోయిన శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా సీనియర్ న్యాయవాది, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు కొయ్యల ఏమాజి, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సబ్బని సాయికుమార్ వ్యవహరించారు.

మహిళా కమిటీ అధ్యక్షురాలిగా సౌమ్య.


ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ బెల్లంపల్లి కోర్టు మహిళా కమిటీ కన్వీనర్ గా తౌటం సౌమ్య, కోకన్వీనర్లుగా పీక మమత, అరకొండ లావణ్య, దుర్గం గౌతమి, కమిటీ సభ్యులుగా ఉమారాణి, స్వర్ణలత ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి కొయ్యల ఏమాజి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా ఎన్నికైన సభ్యులను అభినందించారు. న్యాయవాదుల సమస్యల సాధన కోసం కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎన్నికైన నాయకులను శాలువాలతో ఘనంగా సన్మానించారు.





ఉపాధ్యాయులు నిరంతర విద్యార్థులు

రాయికల్, నవంబర్ 3(మనం న్యూస్) : రాయికల్ మండలంలోని భూపతిపూర్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన రెండవ రోజు ప్రాథమిక పాఠశాల సముదాయ సమావేశంలో మండల విద్యాధికారి రాఘువులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు నిరంతర విద్యార్థులు అని, బోధనా విధానాలలో వస్తున్న నూతన మార్పులకు అనుగుణంగా తమ నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని సూచించారు. నవంబర్ నెలలో ప్రాథమిక స్థాయి విద్యార్థులకు నిర్వహించే మిడ్ లైన్ పరీక్షకు సంబంధించి మాదిరి యాప్ ను సాధన చేసి, పరీక్షను జాగ్రత్తగా నిర్వహించాలని, పరఖ్ రాష్ట్రీయ సర్వేక్షణ్ కు సంబంధించిన ప్రశ్నల నిధిని రూపొందించాలని, మాస వారీ లక్ష్యాల సాధనకు ప్రణాళిక రూపొందించుకుని తగిన బోధనా విధానాలను అమలు చేయాలని సూచించారు. అదే విధంగా శిక్షణ కార్యక్రమాన్ని



సందర్శించిన రాష్ట్ర స్థాయి గణిత రిసోర్స్ పర్సన్ గుండు విజయ్ ఉపాధ్యాయులకు గణిత సమస్యల సాధన గురించి, పరఖ్ ప్రశ్నల సరళి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయులు రమణి, జిల్లా ఎఫ్ ఎల్ ఎన్ సెల్ సభ్యులు కడకుంట్ల అభయ్ రాజ్, అకడమిక్ ప్యానల్ తనిఖీ బృందం సభ్యులు లక్ష్మారెడ్డి, రిసోర్స్ పర్సన్లు రాజ్ మహ్మద్, కడకుంట్ల వినోద్, హరికృష్ణ, పాల్గొన్నారు.

కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



గంగాధర, నవంబర్ 03, (మనం న్యూస్) : గంగాధర మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పంపిణీ చేశారు. మండలం లోని వివిధ గ్రామాలకు చెందిన 30 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం కింద రూ. 30 లక్షల 28 వేల 509 రూపాయలు ఆర్థిక సహాయం మంజూరు కాగా మంగళవారం గంగాధర మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని మహిళలకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, గృహ జ్యోతి పథకంతో 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇండ్లు, సన్న బియ్యం అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కురిక్యాల సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిర్మల్ రావు, తహసీల్దార్ అంబటి రజిత, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంత్రి మహేందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దుబ్బాసి బుచ్చయ్య, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు చిరుత మంగ, మాజీ జెడ్పిటిసి గునుకొండ బాబు, సత్తు కనకయ్య, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు ముద్దం నగేష్, సర్పంచులు పడాల భాగ్యలక్ష్మి రాజన్న, వేముల భాస్కర్, రామిడి రాజిరెడ్డి, రేండ్ల శ్రీనివాస్, బీర్ల ఆనంద్, ఆరె తేజశ్రీ – రాజశేఖర్, మల్కాపురం రాజేశ్వరి రాజేశం, కడారి రేణుక కనకయ్య, ఈటవేని శ్రీనివాస్, కోలేపాక కవిత మల్లేశం, ధీకొండ బాబలక్ష్మి మధు, దానే అనసూర్య ఓదెలు, గుండవేని లావణ్య తిరుపతి, ఎట్టెపు కనకయ్య, గంకిడి సంధ్య చంద్ర రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సాగి అజయ్ రావు, రోమాల రమేష్, కర్ర బాపు రెడ్డి, రాచమల్ల భాస్కర్, దోర్నాల శ్రీనివాస్ రెడ్డి, బురుగు గంగన్న, అత్తపురం తిరుపతి, గంగాధర ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇందుర్తిలో ఘనంగా ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం



చిగురుమామిడి నవంబర్ 23 (మనం న్యూస్) : చిగురుమామిడి మండలంలోని ఇందుర్తి రైతు వేదికలో రైతుల సంక్షేమం కోసం ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా వ్యవసాయ అధికారి చాత్రు నాయక్ మాట్లాడుతూ, వ్యవసాయ భూములను కాపాడుకోవడం, నేల తల్లి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవడం, సహజ వనరులను కాపాడుకోవడం, రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి మోతాదుకు తగ్గట్టుగా వాడడం, ప్రకృతికి మేలు చేసే స్థిరమైన వ్యవసాయ పద్ధతులను రైతులందరూ అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఇదే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. జమ్మికుంట వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త వేణుగోపాల్ మాట్లాడుతూ, ఆరోగ్యవంతమైన నేల ఉంటేనే మంచి పంటలు పండుతాయని, సురక్షితమైన ఆహారం అందుతుందని, రైతులకు ఆర్థికంగా లాభం చేకూరుతుందని వివరించారు. ప్రస్తుతం ఎల్ నినో ప్రభావం వల్ల నీటి కొరత ఏర్పడే అవకాశం ఉందని, అందువల్ల తక్కువ నీటితో పండే కూరగాయల పంటలు వేసుకోవడం రైతులకు ఎంతో మేలు చేస్తుందని సూచించారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు ఎన్. శ్రీధర్, సహకార సంఘం అధ్యక్షులు చిట్టమల్ల రవీందర్, సర్పంచ్ చింతపుల రవీందర్ పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. వ్యవసాయంలో కొత్త పద్ధతులు పాటించడం, నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం, పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కార మార్గాలపై వారు రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి టి. పున్నం చందర్, సహకార సంఘం అధ్యక్షులు చిట్టమల్ల రవీందర్, సహకార సంఘం సంచాలకులు, వ్యవసాయ విస్తరణ అధికారులు సతీష్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

కన్నెపల్లిలో ఉచిత నేత్ర వైద్య శిబిరం



కన్నెపల్లి నవంబర్ 3 (మనం న్యూస్) మండల కేంద్రంలో బెల్లంపల్లి పి. సత్యనారాయణ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో, లయన్స్ క్లబ్ సహకారంతో ఉచిత నేత్ర వైద్య పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.హాస్పిటల్ ట్రస్ట్ సభ్యులు కట్కూరి సత్యనారాయణ, కజ్జం రమేష్ ఆధ్వర్యంలో ఆప్టోమెట్రిస్టులు దత్త గౌడ్, గౌస్ ప్రజలకు నేత్ర పరీక్షలు నిర్వహించారు.ఈ శిబిరానికి సుమారు 150 మంది హాజరై ఉచితంగా కంటి పరీక్షలు చేయించుకున్నారు. పరీక్షల అనంతరం దాదాపు 45 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని వైద్య బృందం గుర్తించి, తదుపరి శస్త్రచికిత్సల కోసం సిఫార్సు చేసింది. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ గడ్డల జయలక్ష్మి వెంకటేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీనివాస్, వార్డు సభ్యులు హాజరయ్యారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచితంగా నేత్ర వైద్య సేవలు అందించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఇలాంటి వైద్య శిబిరాలు గ్రామీణ ప్రాంతాల్లో మరిన్ని నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో సర్పంచులకు మొండిచేయి..



-సర్వసభ్య సమావేశంలో మండిపడ్డ ముదిమాణిక్యం సర్పంచ్

చిగురుమామిడి, నవంబర్ 03: (మనం న్యూస్) ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో కమిటీ సభ్యులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ముదిమాణిక్యం సర్పంచ్ బోయిని రమేష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి చత్రు నాయక్ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గ్రామ ప్రథమ పౌరులైన సర్పంచులకు కనీస సమాచారం కూడా ఇవ్వకుండా అర్హులను ఎలా గుర్తిస్తారని ప్రశ్నించారు. ప్రజల చేత ఎన్నుకోబడిన సర్పంచులను ఇలా అవమానించడం సరికాదన్నారు. గ్రామ సర్పంచ్ కు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా, సంప్రదించకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఆయన అన్నారు. సర్పంచ్ లుగా మాకు సమాచారం లేనప్పుడు ఇక మేము ఎందుకు? ఈ పదవులు ఎందుకు? అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.అధికారుల తీరును నిరసిస్తూ సమావేశంలోనే నిలదీశారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా చిగురుమామిడి మండలాన్ని వెంటనే కరువు మండలంగా ప్రకటించాలని, రైతాంగాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సర్పంచులు లేవనెత్తిన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ప్రత్యేక అధికారి హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో సింగిల్ విండో చైర్మన్ చిట్టమల్ల రవీందర్, ఎంపీవో కిరణ్ కుమార్, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు విద్యార్థిని ఎంపిక



బెల్లంపల్లి, నవంబర్ 3, (మనం న్యూస్) : రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు బెల్లంపల్లిలోని ప్రభుత్వ కో ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని శివాన్విత ఎంపికైందని కళాశాల ప్రిన్సిపాల్ ఆవునూరి అంజయ్య తెలిపారు. గజ్వేల్‌లో ఈ నెల 4, 5, 6 తేదీలలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడా పోటీలలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించేందుకు శివాన్విత ఎంపిక కావడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విద్యార్థినిని ప్రత్యేకంగా అభినందిస్తూ, రాష్ట్రస్థాయి పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని, తద్వారా కళాశాలకు మరియు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని, ఇలాంటి విజయాలు ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సీనియర్ అధ్యాపకులు పి కృష్ణవేణి, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

నిర్మల్ సీడ్స్ ఆధ్వర్యంలో పత్తి పంటలో క్షేత్ర ప్రదర్శన



బెల్లంపల్లి, నవంబర్ 3, (మనం న్యూస్) : బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి గ్రామంలో మంగళవారం నిర్మల్ సీడ్స్ ఆధ్వర్యంలో ఎన్సిహెచ్ 4341 పత్తి విత్తనాలపై క్షేత్రప్రదర్శన నిర్వహించారు. చంద్రవెల్లి చుట్టుపక్కల గ్రామ రైతులను సమావేశపరిచి నిర్మల్ సీడ్స్ విత్తనాలపై అవగాహన కల్పించారు. అధిక దిగుబడి సూచనగా ముందుండే నిర్మల్ సీడ్స్ బయో ఆర్గానిక్స్ కూడా రైతుల ఎంతో దిగుబడి చూపుతాయని తెలిపారు. ఈకార్యక్రమంలో నిర్మల్ సీడ్స్ నిర్వాహకులు ఆర్ఎం సందీప్, డిఆర్ఎం లక్ష్మణ్, టీఎస్‌శే సాయికృష్ణ, రైతులు పాల్గొన్నారు.

నూతన రోడ్డుకు పనులు ప్రారంభం

మంథని నవంబర్3 (మనం న్యూస్) : మంథని పట్టణంలోని చిల్డ్రన్స్ పార్క్ నుండి దహగం వారి మూల మలుపు వరకు నూతన రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మంగళవారం రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మంథని పట్టణ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా రూ. 2కోట్ల56 లక్షలతో డిపో ముందున్న గోదావరిఖని మెయిన్ రోడ్ నుండి చిల్డ్రన్స్ పార్క్ వరకు,అలాగే రెడ్డి భవన్ నుండి ఎరుకల గూడెం మెయిన్ రోడ్డు వరకు, 2 కోట్ల 25 లక్షలతో ఇరువైపులా డ్రైనేజీ సౌకర్యంతో పనులు పూర్తయి అయ్యాయి. ప్రస్తుతం 40 లక్షలతో ప్రారంభమైన ఈ రోడ్డుకు అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ ద్వారా సుమారు 30 ఛాంబర్ లతో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. పూర్తి నాణ్యతతో పనులు జరుగుతున్నాయని స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని 10వ వార్డ్ కౌన్సిలర్ పెంటరి రాజు ఈ సందర్భంగా తెలిపారు.రోడ్డు పనులను మున్సిపల్ ఏఈ మౌనిక, కాంట్రాక్టర్ శ్రీరామ్ పరిశీలించారు.



ఉపాధ్యాయుల సమస్యలపై పిఆర్‌టియు టిఎస్ పోరాటం



జగిత్యాల నవంబర్ 3(మనం న్యూస్) : ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం పి ఆర్ టి యు టి ఎస్ కృషి చేస్తుందని పి ఆర్ టి యు టి ఎస్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు యాళ్ల అమర్నాథ్ రెడ్డి బోయిని పెల్లి ఆనందరావు అన్నారు ఈరోజు ప్రాథమిక పాఠశాల టి ఆర్ నగర్ ప్రధానోపాధ్యాయులు అడ్లగట్ట గంగాధర్ ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమంలో ముఖ్యఅతిథిలుగా పాల్గొ ని 2003 డిఎస్సి సంబంధించిన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు అయ్యే విధంగా కృషి చేస్తామని పిఆర్సి వచ్చేవరకు పోరాటం చేస్తామని వారన్నారు ఈ సందర్భంగా అడ్లగడ్డ గంగాధర్ గారిని ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీలత గంగయ్య ప్రభాకర్ ప్రవీణ్ అనూజ మాధవి షబానా విమల షకీల్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు

బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ మాభూమి రథయాత్రకు పిలుపు



శంకరపట్నం నవంబర్ 3 (మనం న్యూస్) బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఒక లక్ష కిలోమీటర్ల మాభూమి రథయాత్ర లో భాగంగా శంకరపట్నం మండలంలోని మండల అధ్యక్షుడు యమునూరి ప్రశాంత్ ఆధ్వర్యంలో అంబేద్కర్ కూడలి వద్ద పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది. ప్రధానంగా ప్రజా సమస్యల మీద ఈ యాత్ర కొనసాగుతుంది. విద్యావంతులు, యువకులు, మేధావులు, ప్రజా సంఘాల నాయకులు, మానవతావాదులు, పార్టీలకు అతీతంగా పాల్గొని ఈ యాత్రను విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గాజుల రవి, ప్రధాన కార్యదర్శి కనకం లక్ష్మణ్, కవంపల్లి నరసయ్య. వినయ్, నరేష్, సాయి కాంత్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాలు, పాఠశాలల ఆకస్మిక తనిఖీ

జైపూర్, నవంబర్ 3 (మనం న్యూస్):జైపూర్ మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర విద్యాలయాన్ని మంగళవారం కలెక్టర్ కుమార్ దీపక్ ఆకస్మికంగా సందర్శించి, తరగతి గదులు, వంటశాలను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యతను స్వయంగా తనిఖీ చేసిన ఆయన.. మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలని అధికారులను ఆదేశించారు. ఉపాధ్యాయులు విధుల్లో సమయపాలన పాటిస్తూ, చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.అనంతరం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థినులకు మంజూరైన పడకలు, ఇతర వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటర్ ఎంపీసీ విద్యార్థినుల అభ్యాసన సామర్థ్యాలను అడిగి తెలుసుకుని, మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.



జిల్లాలో త్రాగునీటి సరఫరాపై ప్రత్యేక డ్రైవ్



నస్పూర్, నవంబర్ 3, (మనం న్యూస్): వేసవి కాలంలో ప్రజలకు నిరంతరాయంగా సురక్షిత త్రాగునీరు అందించేందుకు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పటిష్ట చర్యలు చేపట్టడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని అదనపు కలెక్టర్ ఛాంబర్ లో గ్రామీణ నీటి సరఫరా ఈ.ఈ. వెంకటేష్, మిషన్ భగీరథ ఈ.ఈ. మధు-సూదన్ లతో కలిసి మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, డి.ఈ.లు, ఎ.ఈ.లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎల్‌నినో పరిస్థితులు, రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు నిరంతరాయంగా సురక్షిత త్రాగునీరు అందించేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ నుండి నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా త్రాగునీటి సరఫరా, మౌలిక సదుపాయాల పనితీరును మెరుగుపరచడంతో పాటు, అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రిడ్, బల్క్ వాటర్ సప్లై పథకాల ద్వారా మున్సిపాలిటీలు, పట్టణ స్థానిక సంస్థలకు శుద్ధి చేసిన నీరు సక్రమంగా చేరేలా పర్యవేక్షించాలని, గ్రామీణ ప్రాంతాలలో ప్రతి గ్రామంలోని ప్రతి ఇంటికీ సురక్షిత త్రాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా మండల స్థాయి సమావేశాలు నిర్వహించి, క్షేత్రస్థాయి తనిఖీల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, తనిఖీ కార్యాచరణ ప్రకారం మండల స్థాయి బృందాలు అన్ని ఆవాసాలను సందర్శించి త్రాగునీటి సరఫరా పరిస్థితి, పైప్‌లైన్లలో లీకేజీలు, వాల్వ్‌ల పనితీరు, నీటి సరఫరా వ్యవస్థలోని లోపాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారని తెలిపారు. ఓవర్ హెడ్ సర్వీస్ రిజర్వాయర్లు, గ్రౌండ్ లెవల్ సర్వీస్ రిజర్వాయర్లు, మ్యాన్‌హోల్స్‌ను క్రమం తప్పకుండా శుభ్రపరచడంతో పాటు, నీటి ట్యాంకులకు క్లోరినేషన్ నిర్వహించాలని, అవసరమైన మేరకు బ్లీచింగ్ పౌడర్ వినియోగించి త్రాగునీటి నాణ్యతను నిర్ధారించాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో వేసవిలో నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి, ఆయా ప్రాంతాలలో ప్రత్యామ్నాయ నీటి వనరులు, సరఫరా మార్గాలను సిద్ధం చేసుకోవాలనిఆదేశించారు. నీటి సరఫరాలో అంతరాయాలు ఏర్పడకుండా ముందస్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని తెలిపారు. ప్రజలు తమ ప్రాంతాలలో త్రాగునీటి సమస్యలు ఎదురైతే అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు 1916 టోల్ ఫ్రీ నంబర్ గురించి విస్తృతంగా ప్రచారం కల్పించాలని తెలిపారు.

జగిత్యాల గడ్డ రామన్న.గోపన్న.జిత్తన్న అడ్డ





జగిత్యాల రూరల్ నవంబర్ 3(మనం న్యూస్) : హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయవాదుల సంగమం . 2026 కార్యక్రమంలో జగిత్యాల పట్టణానికి చెందిన పూర్వ ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఏబీవీపీ పూర్వ జాతీయ కార్యదర్శి డా. కాసం వెంకటేశ్వర్లు బీజేపీ కర్ణాటక రాష్ట్ర సహ ఇన్‌చార్జిగా జాతీయ స్థాయి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యాలయాల పూర్వ విద్యార్థులు, ఏబీవీపీ పూర్వ కార్యకర్తలు, జాతీయవాదుల ఆధ్వర్యంలో ఈ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా డా. కాసం వెంకటేశ్వర్లు గారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల నుంచి పాల్గొన్న పూర్వ ఏబీవీపీ నాయకులు తమ విద్యార్థి దశ నాటి జ్ఞాపకాలను, ఉద్యమ ప్రస్థానంలోని అనుభవాలను నెమరువేసుకుంటూ ఆత్మీయంగా కలుసుకున్నారు. జగిత్యాల ప్రాంతం నుంచి ఏబీవీపీలో పనిచేసిన నాయకులు ఒకే వేదికపై కలుసుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ముదిగంటి రవీందర్ రెడ్డి , పైడిపల్లి సత్యనారాయణ రావు, ఏ సి ఎస్ రాజు, పుప్పాల సత్యనారాయణ, రాజ మనోహర్ రెడ్డి, మ్యాన మహేష్, బేజ్జంకి సంపూర్ణ చారి, బొనగిరి దేవయ్య, అన్నల్దాస్ మురళీ, పిల్లి శ్రీనివాస్, గంద్ర ప్రసాద్ రావు, శివ ప్రసాద్, జున్ను రాజేందర్, సిరిసిల్ల వేణుగోపాల్, మోత్కూరు సుధీర్, కట్ట విజయ్, భూమయ్య, శోభన్, ఒరగంటి చంద్రశేఖర్, బిట్టు, మద్ధం మల్లేష్, చింత అనిల్, పదం మహేందర్ తదితరులు పాల్గొన్నారు. జగిత్యాల గడ్డపై మొదలైన పరిచయాలు.. కాలం గడిచినా చెక్కుచెదరని అనుబంధాలు.. జాతీయవాద భావజాలంతో సాగిన ప్రయాణానికి ఈ సంగమం మరో మధుర జ్ఞాపకంగా నిలిచింది.

జిల్లాస్థాయి ఇన్విటేషన్ వాలీబాల్ క్రీడా పోటీలు

కాసిపేట, నవంబర్ 3(మనంన్యూస్)కాసిపేట మండలం సోమగూడెం శిశు మందిర్ క్రీడా మైదానం లో ఈ నెల 14 నుండి జిల్లా స్థాయి ఇన్విటేషన్ వాలీబాల్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్టు క్రీడా పోటీల నిర్వాహకులు బైరగోని సిద్దయ్య, వోడ్నాల విజయ్ కుమార్ లు తెలియచేశారు. క్రీడాకారులు, నాయకులు సహకరించాలని వారి కోరారు.

జంగ ఒర్రెకు రెండు వైపులా కల్వర్టులు నిర్మించాల్సిందే...!

బుగ్గారం, నవంబర్ 3(మనం న్యూస్): జగిత్యాల జిల్లా బుగ్గారం మండల కేంద్రంలో దశాబ్దాలుగా ప్రజలను ఇబ్బంది పెడుతున్న జంగ ఒర్రె సమస్యకు చివరకు పరిష్కారం లభిస్తోంది. కల్వర్టు నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నప్పటికీ, రెండు వైపులా నిర్మాణాలు చేపట్టకపోతే అసలు ప్రయోజనం నెరవేరదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో జంగ ఒర్రె ఉధృతంగా ప్రవహించడం వల్ల రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. ఈ మార్గం గుండా పాఠశాల, హాస్టల్ విద్యార్థులు, రైతులు, కాలనీవాసులు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. ప్రస్తుతం అధికారులు ఒకవైపు మాత్రమే కల్వర్టు నిర్మాణానికి బడ్జెట్ కేటాయించడంతో, మరోవైపు నుంచి వచ్చే వరద నీరు నేరుగా కాలనీలోకి చేరి ఇళ్లు, ఆస్తులకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని స్థానికులు వాపోతున్నారు.ఈ సమస్య పరిష్కారానికి గ్రామ సర్పంచ్ నక్క రాజవ్వ–రాజయ్య చొరవ తీసుకొని రెండు వైపులా కల్వర్టులు నిర్మించేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ, బడ్జెట్ కొరత అడ్డంకిగా మారిందని, అధికారులు చెబుతున్నారని, రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ నిధులు కేటాయించాలని ప్రజలు



కోరుతున్నారు. కావున ప్రజల భద్రతను, కాలనీవాసుల ఇళ్ల రక్షణను దృష్టిలో ఉంచుకొని జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అదనపు నిధులు మంజూరు చేసి, జంగ ఒర్రెకు ఇరువైపులా కల్వర్టుల నిర్మాణం పూర్తి చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.ఈ విషయమై ధర్మపురి ఎమ్మెల్యే, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చొరవ చూపి నిధులు కేటాయించినట్లయితే సమస్య పరిష్కారం అవుతుందని ప్రజలు కోరుతున్నారు .

బీసీ లైజన్ ఆఫీసర్‌గా ఎంపికైన అడిషనల్ మేనేజర్ రాజుకు సన్మానం

మందమర్రి, నవంబర్ 3:(మనం న్యూస్) శాంతి కని అడిషనల్ మేనేజర్ పి. రాజు మందమర్రి ఏరియా బీసీ లైజన్ ఆఫీసర్ గా ఎంపికైన సందర్భంగా మందమర్రి జిఎం కార్యాలయంలో ఘన సన్మానం నిర్వహించారు. మంగళవారం మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో నూతనంగా మందమర్రి ఏరియా బీసీ లైజన్ ఆఫీసర్ గా ఎంపికైన శాంతిఖని అడిషనల్ మేనేజర్ పి. రాజు ను మందమర్రి జి. యం ఎన్. రాధాకృష్ణ పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

అనంతరం మందమర్రి ఏరియా ఉన్నతాధికారులు, వివిధ బీసీ సంఘం నాయకులు, పి.రాజు ను శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ మాట్లాడుతూ నూతనంగా బీసీ లైజన్ ఆఫీసర్ గా బాధ్యతలు స్వీకరించిన అడిషనల్ మేనేజర్ రాజు బీసీ ఉద్యోగుల, కార్మికుల సంక్షేమానికి నిరంతరం అందుబాటులో ఉంటూ విశేష సేవలు అందించాలని కోరారు. యజమాన్యానికి బీసీ ఉద్యోగులకు మధ్య వారధిగా ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు. కంపెనీ పురోగతిలో బీసీ ఉద్యోగుల పాత్ర కీలకమైనదని అందరిని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని జి. యం రాధాకృష్ణ పేర్కొన్నారు. సన్మాన గ్రహీత బీసీ లైసెన్ ఆఫీసర్ రాజు మాట్లాడుతూ నాపై నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించిన సింగరేణి సంస్థ యజమాన్యానికి,



మద్దతుగా నిలిచిన బీసీ సంఘాల నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. బీసీ ఉద్యోగులు, కార్మికుల న్యాయమైన హక్కులు, సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం నా వంతు బాధ్యతగా నిరంతరం శ్రమిస్తానన్ని ఆయన పేర్కొన్నారు. యాజమాన్యం నియమ, నిబంధనలకు కట్టుబడి, అందరి సహకారంతో ఏరియా అభివృద్ధికి, బీసీ ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉంటానని" రాజు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ శైలేంద్ర సత్యనారాయణ, శాంతిఖని ఏజెంట్ సంతోష్ కుమార్ , ఏరియా సేఫ్టీ ఆఫీసర్ మురళి, డీజీఎం (పర్సనల్) సిహెచ్. అశోక్, టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ మేడిపల్లి సంపత్, మందమర్రి ఏరియా వివిధ విభాగాల ఉన్నతాధికారులు, బీసీ సంఘాల నాయకులు, ప్రతినిధులు మరియు ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వర్షాభావ పరిస్థితులు ..నీటి పొదుపుపై ప్రత్యేక అవగాహన



నెన్నెల, నవంబర్03 (మనం న్యూస్):నెన్నెల రైతు వేదిక వద్ద అటవీ మరియు వ్యవసాయ శాఖ అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో నవంబర్ నెల మొదటి వారం నందు ఎల్నీనో ప్రభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఒక ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రైతులు పెద్దఎత్తున హాజరయ్యారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ నీటిని విలువైన వనరుగా భావించి పొదుపుగా వాడుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే అటవీ ప్రాంతంలోని వన్యప్రాణుల దాహార్తిని తీర్చడానికి అటవీ శాఖ ఆధ్వర్యంలో సహజ నీటి వసతులతో పాటు, కృత్రిమంగా నీటిని అందించేందుకు సాసర్పిట్లను ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. వన్యప్రాణులకు ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా కాపాడుకోవడం మనందరి బాధ్యత అని, ఒకవేళ తాగునీటి కోసం వన్యప్రాణులు పంట పొలాల వైపు వస్తే వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలని రైతులను కోరారు.ఈ కార్యక్రమంలో నెన్నెల డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ బి. ప్రవీణ్ నాయక్, మండల వ్యవసాయ అధికారి సృజన, ఏఈవో ధనలక్ష్మి, ఎఫ్‌బీఓ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్రికెట్ ఎంపికలు..

మంత్రి వివేక్‌కు ఆహ్వానం

జైపూర్, నవంబర్ 3 (మనం న్యూస్):జైపూర్ మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లాస్థాయి క్రికెట్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్‌జిఎఫ్ కార్యదర్శి యాకూబ్ తెలిపారు. ఈ పోటీలు అండర్–14 విభాగంలో కేవలం బాలురకు మాత్రమే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్న ఆయన, ఆసక్తి గల క్రీడాకారులు తమ సంబంధిత ధ్రువపత్రాలతో ఉదయం 9 గంటలకు మైదానానికి హాజరు కావాలని సూచించారు.మరోవైపు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ మాట్లాడుతూ, ఉపాధ్యాయులు, దాతల విరాళాలతో పాఠశాలలో ప్రత్యేకంగా క్రికెట్ పిచ్, నెట్స్ ఏర్పాటు చేశామని, వీటిని ప్రారంభించేందుకు రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామిని ఆహ్వానించినట్లు వెల్లడించారు.ఈ ప్రాక్టీస్ నెట్స్ అందుబాటులోకి వస్తే గ్రామీణ ప్రాంత క్రీడాకారుల నైపుణ్యాలు మరింత మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

స్మార్ట్ డిజిటల్ రేషన్ కార్డులను పంపిణీ చేసిన సర్పంచ్



భీమిని నవంబర్3మనం న్యూస్ : రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రూపొందించిన స్మార్ట్ డిజిటల్ రేషన్ కార్డులను మంగళవారం సర్పంచ్ బండి శ్రీకాంత్ గౌడ్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన రేషన్ కార్డు ద్వారా లబ్ధిదారులకు సౌకర్యవంతంగా ఉండడం కోసం ప్రభుత్వం వీటిని రూపొందించిందని అన్నారు. గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఏ సమస్య ఉన్న నా దృష్టికి తేవాలని గ్రామ అభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, ప్రతి ఒక్కరికీ అవసరమైన సేవలు అందేలా తన వంతు బాధ్యతగా పనిచేస్తానని పేర్కొన్నారు. గ్రామ ప్రజల సంక్షేమం, అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి అవసరాలకు అనుగుణంగా సేవలందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ పి. రాణి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్ ఎల్. మణికంఠ

జన్మదిన వేడుకలు

జగిత్యాల నవంబర్ 3 (మనం న్యూస్) : ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్ రమణ గారి తనయుడు డాక్టర్ ఎల్ మణికంఠ జన్మదిన వేడుకలు జగిత్యాల జిల్లా కేంద్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. డా. మణికంఠ జన్మదినాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని వాల్మీకి ఆవాసంలో విద్యార్థులకు ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆవాసంలోని విద్యార్థులకు ఒక్కరోజు భోజనం ఖర్చు అందజేసి వారికి స్వీట్లు మరియు పండ్లను పంపిణీ చేశారు. మానవతా దృక్పథంతో విద్యార్థుల మధ్య ఈ వేడుకలు జరపడం పట్ల వాల్మీకి ఆవాస నిర్వాహకులు బి ఆర్ఎస్ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల పట్టణ బి ఆర్ ఎస్ పార్టీ కౌన్సిలర్లు కోరుకంటి రాము,తోట హరీష్ నాయకులు అజ్జర్ మహమ్మద్ ఖాన్,పులి మల్లేశం గౌడ్,వసీం మహమ్మద్ అలీ,గాజుల శ్రీనివాస్,గుండేటి మారుతి తదితరులు పాల్గొన్నారు.



సింగరేణిలో గైర్హాజరు కారణంగా తొలగింపునకు గురైన వారి కేసుల పునఃపరిశీలనకు దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాల ,నవంబర్ 03(మనం ప్రతినిధి) : సింగరేణి సంస్థలో 2023 నుంచి 2025 మధ్య కాలంలో విధులకు గైర్హాజరు కారణంగా తొలగించబడిన మాజీ ఉద్యోగుల కేసులను పునఃపరిశీలించాలని యాజమాన్యం నిర్ణయించింది. మళ్లీ ఉద్యోగంలోకి తీసుకునేందుకు హైపవర్ కమిటీని ఏర్పాటు చేసింది. 01.01.2023 నుంచి 31.12.2025 మధ్య కాలంలో గైర్హాజరు కారణంగా తొలగించబడిన వారు దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేసింది. 01.04.2026 నాటికి 46 సంవత్సరాలు లేదా అంతకంటే తక్కువ వయస్సు కలిగి ఉండాలని పేర్కొంది. ఇటీవల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోల్ బెల్ట్ ప్రాంత ప్రజా ప్రతినిధులతో సమావేశం సందర్భంగా డిస్మిస్డ్ ఉద్యోగులకు తిరిగి ఉద్యోగ అవకాశం కల్పించాలని పలువురు ప్రజా ప్రతినిధులు కోరిన నేపథ్యంలో ఈ అంశాన్ని పరిశీలించాలని ఆయన సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. ఈ నేపథ్యంలో 2023 నుంచి 2025 మధ్య కాలంలో గైర్హాజరు కారణంగా డిస్మిస్ అయిన ఉద్యోగులకు అవకాశం కల్పిస్తూ యాజమాన్యం మంగళవారం ఉత్తర్వులు విడుదల చేసింది. తొలగించబడిన కాలానికి ముందున్న గత 05 క్యాలెండర్ సంవత్సరాలలో ఏదైనా 2 సంవత్సరాలలో కనీసం 100 మస్టర్లు పూర్తి చేసి ఉండాలి. జనరల్ అసిస్టెంట్ ట్రైనీ (ఖ+), కేటగిరీ-× పోస్టులో పునఃనియామకం కోసం వైద్యపరంగా ఫిట్‌గా ఉండాలి. అర్హత కలిగి, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనుకునే డిస్మిస్డ్ ఉద్యోగులు తగిన ప్రొఫార్మాలో దరఖాస్తును పూర్తి చేసి, తాము చివరగా పనిచేసిన గని / డిపార్ట్‌మెంట్ అధిపతికి సమర్పించాలి. దరఖాస్తు సమర్పించడానికి చివరి తేదీ 14.11.2026గా సింగరేణి యాజమాన్యం నిర్ణయించింది. ఏరియా జనరల్ మేనేజర్లు అర్హత కలిగిన అభ్యర్థుల దరఖాస్తులను పరిశీలించి, తదుపరి చర్యల నిమిత్తం నిర్ణీత తేదీలోగా సంబంధిత అధికారులకు పంపించాలని కోరింది. పూర్తి వివరాల కోసం సంబంధిత గనులు లేదా శాఖల అధికారులను సంప్రదించాల్సి ఉంటుంది.

అసత్య ప్రచారాలు మానుకోండి

-జువ్వాడి బ్రదర్స్ ఎమ్మెల్యే సంజయ్ పై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదు బిఆర్ఎస్ నాయకులు

కోరుట్ల నవంబర్ 3 (మనం న్యూస్) : ఆదివారం కోరుట్ల ప్రభుత్వాసుపత్రిని సందర్శించి ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కుమార్ పై అసత్య ఆరోపణలు చేసిన జువ్వాడి కృష్ణారావు సోదరులు మీ స్థాయిని మించి అనవసరపు అసత్యపు ప్రచారాలు మానుకోవాలని సూచించారు. కోరుట్ల శాసనసభ్యులు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కుమార్ వీలైన ఎంత మట్టుకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్తున్నారని అనునిత్యం ప్రజా సంక్షేమ కోసం ఆరాటపడుతున్నారని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు ల పై చేసిన వ్యాఖ్యలు తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కల్వకుంట్ల కుటుంబ సభ్యులు మిమ్మల్ని రాజకీయాలలో పలుమార్లు ఓడించినప్పటికీ వార్డు మెంబర్గా కూడా గెలవలేని మీరు మా ఎమ్మెల్యే పై అసత్య ప్రచారాలు మాట్లాడడం సరికాదని మీ వైఖరి మారడం లేదని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో బి రైతు సమన్వయ సమితి జిల్లా మాజీ అధ్యక్షులు చీటీ వెంకట్రావు, మండల అధ్యక్షులు దారిశెట్టి రాజేష్, కౌన్సిలర్లు పహిమ్, పొట్ట సురేందర్, మోసిన్, రాజ్ కుమార్, నరేష్, మహేష్, వెంకటేష్, అబుబాకర్, శేఖర్, వాషిక్, రెహమాన్, నరేష్, అంజయ్య, నవీన్, అస్లాం, రమేష్ తదితరులు ఉన్నారు.



రైతుల సంక్షేమానికై నవంబర్ 10న కలెక్టరేట్ ముట్టడి

మందమర్రి, నవంబర్ 3:(మనం న్యూస్) రైతుల సంక్షేమాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా నవంబర్ 10వ తేదీన అన్ని కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమం చేపడుతున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేణి శంకర్ డిమాండ్ చేశారు. మంగళవారం మంచిర్యాల జిల్లా మందమర్రి మండలంలోని సారంగపెల్లి,అదిల్ పేట్, పొన్నారం, శంకరపల్లి, చిర్రకుంట గ్రామాల్లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేణి శంకర్ పర్యటించి దెబ్బతిన్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని కరువు మండలాల్లో ప్రభుత్వం వెంటనే సహాయక చర్యలు చేపట్టి నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఎల్ నినో ప్రభావం వల్ల రాష్ట్రవ్యాప్తంగా 369 మండలాలను ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రభుత్వం స్వయంగా ప్రకటించిందని, ఇప్పటివరకు ఎలాంటి కరువు సహాయక చర్యలు చేపట్టలేదని ఆయన విమర్శించారు.ప్రతి మండలంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి శాస్త్రీయ పద్ధతిలో అధ్యయనం జరిపి రైతులకు అండగా నిలవాలని కోరారు. రాష్ట్రంలో, దేశంలో 85 శాతం మంది ప్రజలు వ్యవసాయం పైనే ఆధారపడి జీవిస్తున్నారని, అలాంటి రైతుల సంక్షేమాన్ని విస్మరించి పాలకులు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. పాలకుల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు



మేరకు నవంబర్ 10వ తేదీన అన్ని కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమం చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రభుత్వం ప్రకటించిన మండలాలతో పాటు వర్షాభావంతో నష్టపోయిన ఇతర మండలాల్లోనూ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి పంట నష్టపరిహారం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రామడుగు లక్ష్మణ్, మిట్టపెల్లి వెంకటస్వామి, మేకల దాసు, రేగుంట చంద్రశేఖర్, జోగుల మల్లయ్య, ఇప్పకాయల లింగయ్య, భీమనాధుని సుదర్శన్, దాగం మల్లేష్, మిట్టపల్లి శ్రీనివాస్, వనం సత్యనారాయణ, కామెర దుర్గారాజ్, మిట్టపల్లి పౌలు, బొంతల లక్ష్మీనారాయణ, ఆడపు రాజమౌళి, గుండా మాణిక్యం, మామిడి గోపి, నక్క వెంకటస్వామి, జాడిపోశం, దేవి పోశం, పూజారి రామన్న, కొత్తపెల్లి మహేష్, పెరిక సంపత్, మేకల రాజేశం, రత్నం రాజం, దొంతుల రాజన్న పాల్గొన్నారు.

దివ్యాంగులకు UDID సదరం సర్టిఫికెట్ల జారీకి ప్రత్యేక శిబిరాలు

మంచిర్యాల, నవంబర్ 3 (మనం న్యూస్) : జిల్లాలోని దివ్యాంగులకు ఖణ×ణ, సదరం ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నవంబర్ నెలలో ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి తెలిపారు. అర్హులైన దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నవంబర్ 4 న లోకోమోటార్/ ఆర్థో
5 న లోకోమోటార్/ ఆర్థో
10 న లోకోమోటార్/ఆర్థో
11న దృష్టి లోపం/ తలేసేమియా
13న లోకోమోటార్/ ఆర్థో
17న కొడవలి కణం/ సికిల్ సెల్ వ్యాధి,
18 న మానసిక అనారోగ్యం/మేధో వైకల్యం
23న లోకోమోటార్ ఆర్థో
26 న వినికిడి లోపం/ మాట్లాడం /భాష లోపం
27న వినికిడి లోపం/ మాట్లాడం /భాష లోపం

తేదీల్లో మొత్తం పది విడతలుగా ఈ శిబిరాలు కొనసాగనున్నాయి. ఈ శిబిరాలు మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నిర్వహించనున్నారు.

దివ్యాంగులు UDID/SADAREM సర్టిఫికెట్ల కోసం అవసరమైన వైద్య పరీక్షలు, ధ్రువీకరణ ప్రక్రియను ఈ శిబిరాల్లో పూర్తి చేసుకోవచ్చని అధికారులు వెల్లడించారు. గతంలో దరఖాస్తు చేసుకుని పెండింగ్‌లో ఉన్నవారితో పాటు కొత్తగా దరఖాస్తు చేసుకునే అర్హులైన దివ్యాంగులు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. సంబంధిత వివరాల కోసం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులను సంప్రదించాలని సూచించారు.

గీత కార్మికులకు కాటమయ్య కిట్స్ పంపిణీ

జైపూర్, నవంబర్ 3 (మనం న్యూస్):చెట్లు ఎక్కేటప్పుడు ప్రమాదాల బారిన పడకుండా గీత కార్మికుల ప్రాణరక్షణ కోసం ప్రభుత్వం కాటమయ్య కిట్స్ ను అందుబాటులోకి తెచ్చిందని మంచిర్యాల ఆబ్కారీ సీఐ ఎస్ బాబా తెలిపారు.మంగళవారం జైపూర్ మండలం పౌనూర్‌లోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం ఎదుట వేలాల, పౌనూర్, శివారం గ్రామాలకు చెందిన 56 మంది గౌడ సంఘాల గీత కార్మికులకు స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి కిట్లను అందజేశారు.కాంగ్రెస్ సీనియర్ నాయకులు వేముల రీపతి గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీఐ మాట్లాడుతూ.. బీసీ సంక్షేమ అధికారి రాజేశ్వరి పర్యవేక్షణలో నిపుణులైన ట్రైనర్లతో కార్మికులకు ఈ కిట్ల వినియోగంపై ముందస్తుగా శిక్షణ పూర్తి చేశామని, ఇవి ప్రమాదాల నివారణకు ఎంతో దోహదపడతాయని



పేర్కొన్నారు. కార్యక్రమంలో వేలాల పెద్ద గౌడ్ వడ్లకొండ వెంకటస్వామి, పౌనూర్ పెద్ద గౌడ్ వేముల రమేష్, శివారం పెద్ద గౌడ్ మాచిడి సర్వేష్, ఎక్సైజ్ సిబ్బంది, గౌడ కులస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారులు స్పందించారు.. హద్దురాళ్ళను తొలగించారు...!





జమ్మికుంట, నవంబర్ 3 (మనం న్యూస్): జమ్మికుంట తహసిల్దార్ కార్యాలయం ముందు ఉన్న సర్వేనెంబర్ 629లోని ప్రభుత్వ భూమిని సొసైటీగా ఏర్పడిన ఉద్యోగస్తుల ఇళ్ల స్థలాల కోసం 20 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం కేటాయించగా అట్టి భూమిలో పట్టాలు పొందిన పలువురు ఉద్యోగస్తులు తమకు కేటాయించిన స్థలాలకే పరిమితం కాకుండా పక్కనే ఉన్న తహసిల్దార్ కార్యాలయానికి సంబంధించిన భూమిలోనూ హద్దులు ఏర్పాటు చేయడంతో లిలిలికంచె చేను మేసిన వైనం...! శీర్షికతో "మనం" తెలుగు దినపత్రికలో ఈ నెల 1న ప్రచురితమైన వార్తా కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. తహసిల్దార్ కార్యాలయానికి చెందిన భూమిలో ఏర్పాటు చేసిన హద్దు రాళ్లను తహసిల్దార్ ఆదేశాల మేరకు సిబ్బంది తొలగించారు. తహసిల్దార్ కార్యాలయం భూమిని అన్యాక్రాంతం చేయాలని చూస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని ఈ సందర్భంగా తహసిల్దార్ హెచ్చరించారు. ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా తమ పత్రిక ద్వారా అధికారుల దృష్టికి తీసుకువచ్చిన "మనం" దినపత్రిక యాజమాన్యానికి, స్థానిక ప్రతినిధికి ఈ సందర్భంగా పలువురు కృతజ్ఞతలు తెలిపి అభినందించారు.

యువ రైతుల సమ్మేళనం



రాయికల్, నవంబర్ 3 (మనం న్యూస్) : జగిత్యాల జిల్లాలోని పలు మండలాల యువ రైతుల ఆత్మీయ సమ్మేళనం రాయికల్ మండలం ఆలూరులో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఉద్యానవన, వ్యవసాయ శాఖ అధికారులు హాజరై యువ రైతులకు సాగులో ఆధునిక సాంకేతికత, ఉద్యానవన పంటల ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. రానున్న ఎల్‌నినో ప్రభావంతో పంటల సాగు నీటి లభ్యతపై ఆధారపడి ఉంటుందని, ఉద్యానవన పంటలకు తక్కువ నీరు అవసరమవడంతో పాటు నిత్య ఆదాయం పొందే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు. యువత వ్యవసాయంపై ఆసక్తి పెంచుకొని ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ అధిక లాభాలు పొందాలని సూచించారు. ఈ సందర్భంగా డీహెచ్ఓ లత మాట్లాడుతూ మహిళా రైతులు చేస్తున్న కృషి అభినందనీయమని, యువ రైతులు జిల్లాకే ఆదర్శంగా నిలవాలని కొనియాడారు. వివిధ మండలాల రైతులు జాతీయ ఉత్తమ మహిళా రైతు బండారి విజయ వెంకటేష్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ ఫరెవర్ మిత్రబృందం సభ్యులు, డీఏఓ భాస్కర్, నాబార్డ్ డీడీఎం దిలీప్, శాస్త్రవేత్త తిరుపతి, ఏఓ ముక్తీశ్వర్, హెచ్‌ఈఓ అన్వేష్, మాజీ సర్పంచ్ మెక్కొండ రాంరెడ్డి, రాజు, శేఖర్, ఆదిరెడ్డి, మల్లారెడ్డి, గంగారెడ్డి, సతీష్ తదితరులు, మహిళా రైతులు పాల్గొన్నారు.

ప్రతిభకు వైకల్యం అడ్డుకాదు

కరీంనగర్ నవంబర్ 03(మనం బ్యూరో)..కరీంనగర్ జిల్లా సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో సోమవారం స్థానిక డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్టేడియంలో జిల్లా స్థాయి ప్రత్యేక అవసరాలు గల పిల్లల క్రీడలు, సాంస్కృతిక పోటీలు అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాధికారి శ్రీ వై. తిరుపతి రావు ముఖ్య అతిథిగా విచ్చేసి జెండా ఊపి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైకల్యం ఎన్నటికీ ప్రతిభకు అడ్డు కాదు. ప్రతి చిన్నారిలో ఒక ప్రత్యేక ప్రతిభ దాగి ఉంటుంది. అలాంటి ప్రతిభను గుర్తించి, వెలికితీసి, వారికి సమాన అవకాశాలు కల్పించడమే ఈ క్రీడా పోటీల ముఖ్య ఉద్దేశం. ఈ వేదిక ద్వారా పిల్లల్లో ఆత్మవిశ్వాసం, క్రీడా స్ఫూర్తి పెంపొందుతుందిబి అని అన్నారు. ఈ పోటీలలో జిల్లాలోని వివిధ మండలాల నుండి మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన సుమారు 200 మందికి పైగా ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. వారి కోసం పరుగు పందెం, వ్యాస రచన, కుర్చీ పరుగు, చిత్రలేఖనం తదితర అంశాల్లో పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షా కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ శ్రీ దాసి శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్లు శ్రీనివాస్, రామానంద తీర్థ, శ్రీధర్ రెడ్డి, జ్యోతి, జిల్లాలోని స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లు, ఐ ఈ ఆర్ పి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.అనంతరం వివిధ విభాగాల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు జిల్లా విద్యాధికారి చేతుల మీదుగా బహుమతులు, పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమం ముగింపులో సిఎంవో దాసి శ్రీనివాస్ మాట్లాడుతూ పోటీల నిర్వహణకు సహకరించిన జిల్లా యంత్రాంగానికి, స్టేడియం సిబ్బందికి మరియు ఉపాధ్యాయులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



కార్మిక నాయకుడిని పరామర్శించిన ఇనుముల..!



మంథని నవంబర్03 (మనం న్యూస్) : మంథని మున్సిపల్ పరిధిలో గల వాగు గడ్డ వీధిలో నివాసం ఉంటున్న పెద్దపల్లి జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి,సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు,మంథని మండలం కాకర్లపల్లి గ్రామానికి చెందిన బూడిద గణేష్ కు గతకొద్ది రోజుల క్రితం బైపాస్ సర్జరీ జరిగి,ఇంటి వద్ద విశ్రాంతి తీసుకొంటుండగా మంగళవారం గణేష్ ఇంటికి మంథని మాజీ ఉపసర్పంచ్, హైకోర్టు న్యాయవాది ఇనుముల సత్యనారాయణ(సతీష్)వెళ్లి వారిని పరామర్శించారు.ఈ సందర్భంగా వారి ఆరోగ్య పరిస్థితిని, చికిత్స గురించి అడిగి,వారు త్వరగా కోలుకొని ప్రజా క్షేత్రంలో కార్మికుల సంక్షేమం కోసం తిరిగి కృషి చేయాలని కోరారు.ఆయన వెంటఈ 7వ వార్డుకు చెందిన విశ్వ బ్రాహ్మణ సంఘం నాయకుడు కాయితోజు సమ్మయ్య పాల్గొన్నారు.

వెలమ సంఘం అధ్యక్షున్ని సన్మానించిన మంత్రి అడ్లూరి



బుగ్గారం, నవంబర్ 3(మనం న్యూస్): జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం సిరికొండ గ్రామానికి చెందిన కొండపల్కుల దామోదర్ రావు ని గ్రామ వెలమ సంఘం అధ్యక్షుని గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నా సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ధర్మపురి క్యాప్ ఆఫిసులో దామోదర్ రావు ని శాలువా తో సన్మానించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామంలో నూతనంగా వెలమ సంఘం ఏర్పాటు చేయడం చాలా సంతోషం అని ప్రజా ప్రభుత్వం అన్ని కుల సంఘాలకు ప్రత్యేక స్థానం కల్పిస్తుందని తెలియపరిచారు..ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పంచిత ధర్మరాజు,ఉప సర్పంచ్ గజ్జెల విజయ్, వార్డు సభ్యులు బండ్ల సతమ్మ – శ్రీనివాస్, గజ్జెల నవ్య –రాజేష్, చెన్నామల్ల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలిచిన గ్రామస్తులు

ఇల్లందకుంట, నవంబర్ 3 (మనం న్యూస్): ఇల్లందకుంట మండలం సిరిసేడు గ్రామానికి చెందిన బూర్ల రంజిత్ ఇటీవల అనారోగ్య కారణంగా మృతి చెందగా అతని మిత్రులు గ్రామస్తులు రూ. 57,500, నగదును వారి కుటుంబానికి అందజేసి అండగా నిలిచారు. నిరుపేద కుటుంబానికి చెందిన బూర్ల రంజిత్ మృతికి చింతిస్తూ, అతనికి ఇద్దరు కూతుర్లు భార్య ఉండగా పదో తరగతి స్నేహితుల బృందం, సిరిసేడు యువకులు, పద్మశాలి కుల బంధువులు ఆర్థికంగా అండగా నిలిచారు. పిల్లల భవిష్యత్తుకు ఆర్థిక భరోసా కల్పించేందుకు అందరూ కలిసి రూ.57,500 సేకరించారు. ఇందులో రూ.50,000ను రంజిత్ పెద్ద కుమార్తె పేరుపై పోస్టాఫీస్‌లో పదేళ్ల ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయగా, మిగిలిన రూ.7,500ను ఆయన భార్య కుటుంబ అవసరాల కోసం అందజేశారు. కష్టకాలంలో మానవత్వంతో స్పందించి కుటుంబానికి అండగా నిలిచిన మిత్రులు, బంధువుల సేవను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో వెల్ది శివకుమార్, కొక్కుల లక్ష్మీపతి, చేరాల వైకుంఠం, కురిమిండ్ల రాజు పాల్గొన్నారు.



కరువు మండలంగా ప్రకటించాలని వినతి పత్రం అందజేత



సైదాపూర్ నవంబర్ 3 (మనం న్యూస్) : సైదాపూర్ మండల కేంద్రంలో నిర్వహించిన సర్వసభ సమావేశంలో బారసా నాయకులు సర్పంచులు నీరసనా తెలుపుతూ, మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని మండల స్పెషల్ ఆఫీసర్ గా జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్లు ఇందిరమ్మ ఇండ్లలో అవకతవకలు జరిగాయని బారస నాయకులు, బారస సర్పంచులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బారసా మండల అధ్యక్షులు చెలిమెల రాజేశ్వర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్, నాయకులు మాజీ ఎంపీపీ సారబుద్ల ప్రభాకర్ రెడ్డి, మాజీ పిఎస్ఎస్ చైర్మన్, బిల్ల వెంకట్రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రావుల శ్రీధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలే



సైదాపూర్ నవంబర్ 3 (మనం న్యూస్) : సైదాపూర్ మండల కేంద్రంలో నిర్వహించిన సర్వసభ సమావేశంలో పలువురు సర్పంచులు సైదాపూర్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సమావేశానికి మండల స్పెషల్ ఆఫీసర్ గా జిల్లా పంచాయతీ అధికారి వి జగదీశ్వర్లు ఏకగ్రీవ తీర్మానం ద్వారా కలెక్టర్ కు ప్రభుత్వానికి పంపించి వెంటనే సైదాపూర్ కరువు మండలంగా ప్రకటించాలని, ఇందిరమ్మ ఇండ్లలో అవకతవకలు జరిగాయని బారస సర్పంచులు నిరసన తెలిపారు. . ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్, ఎంపిడిఓ యాదగిరి, తహసిల్దార్ శ్రీనివాస్ గౌడ్, మండల సిబ్బంది సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

కళల్లో ఒకరు, క్రీడల్లో ఇద్దరూ.. సత్తా చాటిన కవలలు



గంగాధర, నవంబర్ 03, (మనం న్యూస్) : గంగాధర మండలంలోని మోడల్ స్కూల్ లో చదువుతున్న కవలలు రావుల స్రాగ్వి, రావుల స్నిగ్ధ కళా నైపుణ్యంలో, క్రీడలలో రాణిస్తూ తమ నైపుణ్యాన్ని చాటుతున్నారు. జిల్లాస్థాయిలో నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో గంగాధర మోడల్ స్కూల్ విద్యార్థిని రావుల స్రాగ్వి ప్రథమ బహుమతి సాధించి తన అద్భుత ప్రతిభను చాటుకుంది. చిన్న వయస్సులోనే చిత్రలేఖనంలో అసాధారణ నైపుణ్యాన్ని ప్రదర్శించి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోవడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా జిల్లాస్థాయిలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్‌లో కూడా మోడల్ స్కూల్ జట్టు అద్భుత ప్రతిభ కనబరిచి విజేతగా నిలిచింది. ఈ జట్టులో చిత్రలేఖన పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన రావుల స్రాగ్వి తో పాటు కవల సోదరి రావుల స్నిగ్ధ సభ్యులుగా ఉండటం విశేషం. ఒకే కుటుంబానికి చెందిన కవల సోదరీమణులు వివిధ రంగాల్లో తమ ప్రతిభను చాటుకుంటూ పాఠశాలకు గుర్తింపు తీసుకురావడం అభినందనీయమని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. విద్యతో పాటు క్రీడలు, కళారంగాల్లోనూ విద్యార్థులు రాణించేలా పాఠశాలలో ప్రోత్సాహం అందిస్తున్నామని ఈ సందర్భంగా ఉపాధ్యాయులు తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడంతో పాటు క్రీడా నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేక శిక్షణ, ప్రోత్సాహం అందించడం వల్లే ఇలాంటి విజయాలు సాధ్యమవుతున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ పద్మ, వైస్ ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, పీడీ నాగరాజు, ఉపాధ్యాయులు రావుల స్రాగ్విని, రావుల స్నిగ్ధలను ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు, తల్లి దండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

కుక్కల దాడిలో గాయపడిన బాలుడిని పరామర్శిస్తున్న శాసనసభ్యులు సంజయ్



కోరుట్ల నవంబర్ 3 (మనం న్యూస్) : పట్టణంలోని 21 వార్డులో కుక్కల దాడిలో గాయపడిన బాలుడి గురించి విషయం తెలుసుకున్న కోరుట్ల శాసనసభ్యులు కల్వకుంట్ల సంజయ్ హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని బాలుడు ఆరోగ్య పరిస్థితిని వైద్యులను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకుని అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పిల్లలను ఒంటరిగా నిర్మానుష్య ప్రాంతాలకు పంపకూడదని ఒంటరిగా ఎక్కడికి వెళ్ళనివ్వకూడదని పేర్కొన్నారు. వీధి కుక్కలను త్వరలోనే మున్సిపల్ అధికారులచే పట్టించి వాటిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తామని స్పష్టం చేశారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు



రాయికల్, నవంబర్ 3(మనం న్యూస్) : లయన్స్ క్లబ్ రాయికల్ ఆధ్వర్యంలో ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఉచిత మధుమేహం (షుగర్), రక్తపోటు (బీపీ) పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 60 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు వాసం ప్రసాద్, కార్యదర్శి కనపర్తి శ్రీనివాస్, కోశాధికారి సుధావేణి మురళి గౌడ్, మ్యకల రమేష్, దాసరి గంగాధర్, కొత్తపల్లి రంజిత్, మచ్చ శేఖర్, కొయ్యడి మహిపాల్ రెడ్డి, సామల సత్యనారాయణ, కురుమ సుదర్శన్ రెడ్డి, కౌన్సిలర్ పల్లికొండ గంగాధర్, బెక్కం తిరుపతి, సంకోజి అశోక్, ఆశన్న, ల్యాబ్ టెక్నీషియన్ మోసారపు సంతోష్, ఆర్ఎంపీ డాక్టర్ కటకం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే.. రిజిస్ట్రేషన్ రద్దుకు సిఫారసు చేస్తాం

హుజురాబాద్, నవంబర్ 3 (మనం న్యూస్): హుజురాబాద్ మండలం చెల్పూర్ మేజర్ గ్రామపంచాయితీ పరిధిలోని అర్టిసీ బస్టాండ్ కు సమీపంలో ఉన్న ప్రైవేట్ భూమి 967/ఎ లో 14గుంటల భూమిని గ్రామపంచాయితీ నుండి ఎలాంటి అనుమతులు లేకుండా కనీసం రహదారికి 5ఫీట్ల స్థలం వదలకుండా 8ప్లాట్లుగా విభజించి, అక్రమార్గంలో 1-2 ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసిన సంఘటనపై గ్రామ ఉప సర్పంచ్ నేరేళ్ల శ్రీనివాస్ గౌడ్ కరీంనగర్ జిల్లా కలెక్టర్ కు వారం రోజుల క్రితం ప్రజావాణిలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం హుజురాబాద్ సబ్ డివిజనల్ పంచాయితీ అధికారి శ్రీనివాస్, ఎంపివో రాజేందర్, గ్రామ సర్పంచ్ వంతడుపుల కస్తూరి, ఉప సర్పంచ్ నేరేళ్ల శ్రీనివాస్ గౌడ్, కార్యదర్శి బానోతు రమేష్లు సంబంధిత భూ యజమానిపై భూమి క్రయవిక్రయాలపై నాలుగు గంటల పాటు సమగ్ర న్యాయ విచారణ జరిపారు.



కరువు పరిస్థితులను చూసి కేంద్రం జాతీయ విపత్తుగా ప్రకటించాలి

-సిపిఐ సీనియర్ నాయకులు,మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి



కరీంనగర్ నవంబర్ 03(మనం బ్యూరో)..రాష్ట్రంలో ఎల్. ని.నో ప్రభావం మూలంగా తీవ్రమైన కరువు పరిస్థితులు ఏర్పడ్డ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తక్షణమే జాతీయ విపత్తుగా ప్రకటించి,కరువు సహాయ చర్యలు చేపట్టడానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని సిపిఐ సీనియర్ నాయకులు,మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సిపిఐ ఆధ్వర్యంలో కరువు ప్రాంతాలలో సిపిఐ బృందాలు పర్యటిస్తున్న నేపథ్యంలో మంగళవారం కరీంనగర్ జిల్లా రామడుగు మండలం మోతే గ్రామంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ తో కలిసి చాడ వెంకటరెడ్డి ఎండిపోయిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కరువు పరిస్థితులు స్పష్టంగా కనబడుతున్నాయని, వర్షపాతం తక్కువ నమోదు కావడం మూలంగా రైతులు వేసిన పంటలు ఎండిపోతున్నాయని, ఎకరానికి 30 నుండి 50 వేల వరకు పెట్టుబడులు పెట్టి వరి పంట వేస్తే సాగునీరు అందక వర్షాలు కురవక ఆ పంటలు ఎండిపోతున్నాయని, రామడుగు మండలం మోతే గ్రామానికి చెందిన లత అనే మహిళ ఒక ఎకరం పదిహేను గుంటల కులం వేస్తే పూర్తిగా ఎండిపోయి తీవ్ర నష్టం వాటిల్లిందని తమతో ఆవేదన వ్యక్తం చేసిందన్నారు.

మెట్ట ప్రాంతాలకు సాగునీరు అందించడానికి గోదావరి జలాలను ఎత్తిపోతల ద్వారా అందించాలని కీర్తిశేషులు చీఫ్ ఇంజనీరు శివరామకృష్ణయ్య ఆనాడు ప్రతిపాదన చేసినప్పటికీ అమలుకు నోచుకోలేదని, సిపిఐ మొదటి నుంచి పోరాటాలు చేస్తుందని, అది సాధ్యం కాకపోవడం మూలంగా వరద కాలువ ద్వారా సాగునీరు అందిస్తామని 35 ఏళ్లుగా పాలకులు చెబుతున్నారు తప్ప అమలు కావడంలేదని, పాలకులు మారుతున్నారు తప్ప రైతులకు సాగునీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్. ని.నో ప్రభావంపై రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారని, ఇటీవల అఖిలపక్ష సమావేశం కూడా నిర్వహించారని, మరిన్ని సమావేశాలు,సమీక్షలు నిర్వహించి రైతులకు మేలు చేయాలన్నారు.క్షేత్రస్థాయిలో అధికారులు కరువు ప్రాంతాల్లో పర్యటించి ఆయా మండలాల్లో ఎండిపోయిన పంటలను పరిశీలించి నివేదికలు తయారుచేసి ప్రభుత్వానికి పంపాలని కంటి తుడుపు చర్యగా కేవలం కొన్ని మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించడం బాధాకరమని అన్నారు. కరువుతో అల్లాడుతున్న రైతాంగాన్ని ఆదుకోవడం కోసం ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి జాతీయ విపత్తుగా ప్రకటించడానికి కృషి చేయాలని, కేంద్రం నుండి ప్రత్యేక నిధులను విడుదల చేయడానికి ప్రయత్నించాలని, ఎండిపోయిన వరి పంటకు ఎకరానికి 30 వేల రూపాయల చొప్పున నష్టపరిహారం అందించాలని రాష్ట్ర ప్రభుత్వానికి వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సిపిఐ బృందాలు కరువు ప్రాంతాలను పర్యటించి, రైతుల కష్టాలను ఎండిపోయిన పంటలను ప్రత్యక్షంగా తెలుసుకొని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తామని ఈనెల 10వ తారీఖున అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నా నిర్వహిస్తున్నామని వెంకటరెడ్డి తెలిపారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ తీవ్రమైన కరువుతో కొట్టుమిట్టాడుతున్న ప్రాంతాలను గుర్తించడంలో అధికారులు వైఫల్యం చెందుతున్నారని,ఏసీ గదుల్లో కూర్చొని,కేవలం వర్షం పాత నమోదును దృష్టిలో పెట్టుకొని కరువు మండలాలను గుర్తించడం కారణమని, కరీంనగర్ జిల్లాలో కేవలం హుజురాబాద్, కరీంనగర్ అర్బన్, కరీంనగర్ రూరల్ ప్రాంతాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించడం హాస్యాస్పదమని, జిల్లా వ్యాప్తంగా అనేక మండలాల్లో సాగునీటి ఎద్దడి, కరెంటు సక్రమంగా అందించకపోవడం మూలంగా రైతుల పంటలు ఎండిపోయాయని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అధికారులను క్షేత్రస్థాయి పంటల పరిశీలనకు పంపించి పంటల నష్టాన్ని అంచనా వేసి జిల్లాలోని మిగతా మండలాలను కూడా కరువు మండలాలుగా ప్రకటించడానికి చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో రైతుల పక్షాన సిపిఐ పోరాటాలకు సిద్ధం కాక తప్పదని శ్రీనివాస్ తెలిపారు. పంటల పరిశీలన కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి అందె స్వామి జిల్లా కార్యవర్గ కౌన్సిల్ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్,బోయిని అశోక్, గూడెం లక్ష్మీ,నాగెల్లి లక్ష్మారెడ్డి, కసిరెడ్డి సురేందర్ రెడ్డి,పిట్టల సమ్మయ్య, న్యాలపట్ల రాజు, సిపిఐ రామడుగు మండల కార్యదర్శి ఉమ్మెంతల రవీందర్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు కసి రెడ్డి మణికంఠ రెడ్డి, మచ్చ రమేష్,అందె చిన్న స్వామి,మాజీ మండల కార్యదర్శి గొడిసెల తిరుపతి గౌడ్,నాయకులు వేముల మల్లేశం, మచ్చ నర్సయ్య, గోలీ బాపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా తయారీ చేస్తే కఠిన చర్యలు

అలుగామలో పోలీసు, ఎక్సైజ్ శాఖల సంయుక్త దాడులు

25 లీటర్ల నాటుసారా స్వాధీనం..

2 వేల లీటర్ల బెల్లం పానకం ధ్వంసం

కోటపల్లి, నవంబరు 3: మనం న్యూస్ : గుడుంబా తయారీ, విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని చెన్నూరు రూరల్ సీఐ కృష్ణ హెచ్చరించారు. యువత గంజాయికి దూరంగా ఉండాలని, మత్తు పదార్థాలకు అలవాటుపడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. కోటపల్లి మండలం అలుగామ గ్రామంలో మంగళవారం పోలీసు, ఎక్సైజ్ శాఖల అధికారులు సంయుక్తంగా గుడుంబా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా, మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్ ఆదేశాల మేరకు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో చెన్నూరు రూరల్ సీఐ కృష్ణ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. గుడుంబా తయారీ, విక్రయాలకు సంబంధించి దుర్గం స్వామి, దాగం రమేష్, దాగం గోపాల్‌పై కేసులు నమోదు చేశారు. వారి వద్ద నుంచి 25 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని, తయారీకి సిద్ధంగా ఉంచిన 2 వేల లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా సీఐ కృష్ణ మాట్లాడుతూ, గుడుంబా కారణంగా కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయని, ఎవరూ ఈ వ్యాపారానికి పాల్పడవద్దని సూచించారు. గంజాయి విక్రయించినా, సేవించినా ఉపేక్షించేది లేదన్నారు. మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన వాహన తనిఖీల్లో సరైన పత్రాలు లేని 40 వాహనాలను సీజ్ చేశారు.

కార్యక్రమంలో కోటపల్లి ఎస్ఐ రాజశేఖర్, నిల్వాయి ఎస్ఐ నాగరాజు, ఎక్సైజ్ ఎస్ఐ సాయి, పోలీసు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.



మున్సిపల్ అధికారులు స్పందించారు.. అక్రమ విద్యుత్ వినియోగాన్ని అరికట్టారు..!



మున్సిపల్ విద్యుత్‌ను టపాసుల వ్యాపారులు అక్రమ వినియోగం..!

నిబంధనలు బేఖాతరు..

ప్రజాధనానికి గండి..!

జమ్మికుంట, నవంబర్ 2 (మనం న్యూస్): జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో దీపావళి పండుగ సందర్భంగా ఏర్పాటు చేస్తున్న టపాసుల దుకాణాల సముదాయానికి నిబంధనలకు విరుద్ధంగా మున్సిపాలిటీకి చెందిన విద్యుత్‌ను వినియోగిస్తున్నారనే ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి. ప్రైవేటు వ్యాపార అవసరాలకు మున్సిపల్ విద్యుత్‌ను ఉపయోగించడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. టపాసుల విక్రయాల కోసం ఏర్పాటు చేసిన దుకాణాల సముదాయంలో విద్యుత్ అవసరాలకు సంబంధించి నిబంధనలను పాటించాల్సి ఉన్నప్పటికీ, మున్సిపాలిటీకి చెందిన విద్యుత్‌ను వినియోగిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వ్యాపారులు తమ సొంత ఖర్చులతో విద్యుత్ సదుపాయాలు ఏర్పాటు చేసుకోవాల్సి ఉండగా, ప్రజాధనంతో నిర్వహిస్తున్న మున్సిపల్ విద్యుత్‌ను వినియోగించడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

అధికారుల పర్యవేక్షణ ఏది..?

ప్రజా అవసరాల కోసం వినియోగించాల్సిన మున్సిపల్ విద్యుత్‌ను ప్రైవేటు వ్యాపారులు ఉపయోగిస్తుంటే సంబంధిత అధికారులు ఏం చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై అధికారులు స్పందించి, విద్యుత్ వినియోగానికి సంబంధించిన అనుమతులు పరిశీలించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ప్రజాధనానికి నష్టం.. బాధ్యులెవరు..?

మున్సిపల్ విద్యుత్ వినియోగంపై సమగ్ర విచారణ చేపట్టి, నిబంధనలకు విరుద్ధంగా వినియోగం జరిగినట్లు తేలితే బాధ్యుల నుంచి ఖర్చులను వసూలు చేయాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అక్రమ విద్యుత్ వినియోగానికి అడ్డుకట్ట వేసి, మున్సిపల్ ఆదాయానికి గండి పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

మనం https://www.manamepaper.com/clip/333127 Karimnagar 3-10-2026

జమ్మికుంట, నవంబర్ 3 (మనం న్యూస్): జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో దీపావళి పండుగ సందర్భంగా ఏర్పాటు చేస్తున్న టపాసుల దుకాణాల సముదాయానికి నిబంధనలకు విరుద్ధంగా మున్సిపాలిటీకి చెందిన విద్యుత్‌ను వినియోగిస్తున్న తీరుపై "మనం" తెలుగు దినపత్రికలో మంగళవారం లిలిమున్సిపల్ విద్యుత్తును టపాసుల వ్యాపారులు అక్రమ వినియోగం..! అనే శీర్షికతో ప్రచురితమైన వార్తా కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు మంగళవారం మున్సిపల్ సిబ్బంది అక్రమంగా వినియోగిస్తున్న విద్యుత్ కనెక్షన్ ను తొలగించి సంబంధిత విద్యుత్ వైర్ ను మున్సిపల్ కార్యాలయానికి తీసుకెళ్లారు. వ్యాపారులు తమ సొంత ఖర్చులతో విద్యుత్ సదుపాయాలు ఏర్పాటు చేసుకోవాలని అక్రమంగా మున్సిపల్ కు సంబంధించిన విద్యుత్తును వినియోగిస్తే చూస్తూ ఊరుకోబోమని మున్సిపల్ కమిషనర్ అన్నారు. అక్రమ విద్యుత్ వినియోగానికి అడ్డుకట్ట వేసి, మున్సిపల్ ఆదాయానికి గండి పడకుండా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టేందుకు తమ పత్రిక ద్వారా కృషి చేసిన "మనం" తెలుగు దినపత్రిక ప్రతినిధిని స్థానిక ప్రజలు అభినందించారు.



మనం కథనానికి స్పందన

కళ్యాణ్ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



మల్యాల, నవంబర్ 3,(మనం న్యూస్) : మల్యాల మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద సోమవారం సంక్షేమ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గౌరవ చొప్పదండి శాసనసభ్యులు, కరీంనగర్ డీసీసీ అధ్యక్షులు, అసెంబ్లీ దళిత సంక్షేమ కమిటీ చైర్మన్ ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి ,షాదీ ముబారక్ చెక్కులను రూ. 32,03,712/- విలువ చేసేవి, అలాగే ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను రూ. 26,87,000/- విలువ చేసేవి పంపిణీ చేశారు. అనంతరం ముత్యంపేట కొండగట్టులో హనుమాన్ మహిళా సమాఖ్య సంఘ భవనాన్ని ప్రారంభించారు. అలాగే మల్యాల బీసీ కాలనీలో రూ. 5 లక్షలతో నిర్మించనున్న డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో , ఎంపీడీవో స్వాతి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్, సర్పంచులు దారం ఆది రెడ్డి, మిలిటరీ శీను, జంగిలి హనుమంతు, దొంగ ఆనందరెడ్డి, సింగల్ విండో చైర్మన్లు నేరెళ్ల సతీష్ రెడ్డి, కొల్లూరి గంగన్న, ఉప సర్పంచులు కటకం వినయ్ కుమార్ , లక్ష్మణ్ చారి, ముత్యం రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు శనగరపు తిరుపతి , హరినాథ్, దూస వెంకన్న, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తుల అరెస్టు చేసి రిమాండ్‌కు తరలింపు

కరీంనగర్ నవంబర్ 03(మనం బ్యూరో)...రేకుర్తి కి చెందిన మహమ్మద్ మున్న మరియు మహమ్మద్ షారుక్ లు గత కొంతకాలంగా మహారాష్ట్ర లోని మరియు ఇతర రాష్ట్రాల నుండి గంజాయిని తక్కువ ధరకు కొని కరీంనగర్ తీసుకు వచ్చి, చిన్న చిన్న ప్యాకెట్ల రూపంలో గంజాయి సేవిస్తున్న విద్యార్థులకు, ఇతరులకు అమ్ముతూ అక్రమార్జన చేస్తున్నారు. ఇదే క్రమంలో 15 రోజుల క్రితం మహారాష్ట్రలోని నాగపూర్ కి వెళ్లి గుర్తుతెలియని వ్యక్తుల వద్ద కిలోకి 20,000/- రూపాయల చొప్పున 2.200 kg+ ల గంజాయి కొని, రేకుర్తికి తీసుకువచ్చి చిన్నచిన్న ప్యాకెట్లుగా తయారుచేసి కిలో గంజాయికి 50,000/- రూపాయల చొప్పున అమ్మడానికి సిద్ధం చేశారు. ఒక చేతి సంచిలో అట్టి 2.200 కీలో ల గంజాయిని తీసుకొని రేకుర్తిలోని సమ్మక్క గద్దెల వద్ద కెనాల్ కాల్వ వెంబడి నడుచుకుంటూ వెళ్తుండగా, కొత్తపల్లి పోలీసులు ఎస్సై సాంబమూర్తి తన సిబ్బంది యుక్తంగా పెట్రోలింగ్ చేయుచుండగా, పోలీసులను చూసి ఇద్దరు వ్యక్తులు పారిపోవడానికి ప్రయత్నించారు. అనుమానం వచ్చి వారిని పట్టుకుని, విచారించగా సంచిలో ఉన్న రెండు కిలోల గంజాయిని పట్టుకున్నారు. తదుపరి పంచుల సమక్షం లో పంచనామా నిర్వహించి వారి వద్ద నుండి గంజాయి మరియు సెల్ ఫోన్లు సీజ్ చేసి, కొత్తపల్లి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు కొత్తపల్లి ఎస్ హెచ్ ఓ బిల్లా కోటేశ్వర్ తెలిపినారు. గంజాయి విక్రయిస్తున్న వ్యక్తులను పట్టుకున్న ఎస్ఐ సాంబమూర్తిని హెడ్ కానిస్టేబుల్ హరి కేశవ్, పరశురాములు కానిస్టేబుల్ శ్రీనాథ్, వెంకటేష్, శ్రీనివాస్, శివ లను సిఐ అభినందించారు.



జిల్లా అదనపు కలెక్టర్ డా. అశ్విని తానాజీ వాకడే శ్రీ నిత్యకు అభినందనలు



కరీంనగర్ నవంబర్ 03(మనం బ్యూరో)...కరీంనగర్‌లోని ఎస్.ఆర్.ఆర్. ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (ఏ) కు చెందిన బి.ఎస్‌సీ తృతీయ సంవత్సరం విద్యార్థిని ఎం. శ్రీనిత్య అరుదైన గౌరవాన్ని సొంతం చేసుకుంది. భారత మాజీ ఉ పప్రధాని సర్దార్ వల్లభభాయ్ పటేల్ 151వ జయంతి సందర్భంగా న్యూఢిల్లీలోని భారత పార్లమెంట్ (లోక్‌సభ)లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొనే అవకాశాన్ని దక్కించుకుంది. వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ -- 2026 రాష్ట్రస్థాయి పోటీలలో తన ప్రతిభను అద్భుతంగా ప్రదర్శించి, ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినిగా ఎంపిక కావడంతో శ్రీనిత్యకు ఈ అరుదైన అవకాశం లభించింది. దేశ రాజధానిలోని పార్లమెంట్ వేదికపై పాల్గొనడం కళాశాలకు, కరీంనగర్ జిల్లాకు గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ డా. అశ్విని తానాజీ వాకడే , శ్రీనిత్యను ప్రత్యేకంగా అభినందించి, ఆమె సాధించిన విజయాన్ని ప్రశంసించారు. విద్యార్థులు జాతీయ స్థాయి వేదికలపై తమ ప్రతిభను చాటుకుంటూ దేశాభివృద్ధి, ప్రజాస్వామ్య విలువలు, యువత బాధ్యతల పట్ల అవగాహన పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు. శ్రీనిత్య సాధించిన ఈ విజయంపై కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. రామకృష్ణ , జిల్లా యువజన అధికారి జి. తిరుపతి రెడ్డి, ఎన్ఎస్ఎస్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ డా. కె. సురేందర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ పి నితిన్ మరియు టి. రాజయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు బి. ఎలిజబెత్ రాణి, డా. కె. అర్జున్, డా. పి. తిరుపతి, ఎం. వెంకటేశ్వర్లు, జి. రాజేందర్ మరియు కళాశాల అధ్యాపక బృందం హర్షం వ్యక్తం చేస్తూ ఆమెను అభినందించారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, ప్రజాస్వామ్య స్పృహ మరియు జాతీయ సమైక్యతా భావాలను పెంపొందించడంలో ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని కళాశాల యాజమాన్యం పేర్కొంది. శ్రీనిత్య సాధించిన ఈ ఘనత ఎస్.ఆర్.ఆర్. ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలకు మాత్రమే కాకుండా యావత్ కరీంనగర్ జిల్లాకు గర్వకారణం. ఆమె మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కళాశాల కుటుంబం ఆకాంక్షించింది.

జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌కు ఐదుగురి ఎంపిక

కరీంనగర్ నవంబర్ 03(మనం బ్యూరో)...జిల్లా సైన్స్ మ్యూజియంలో ఈరోజు ఉదయం 32వ బాలల సైన్స్ కాంగ్రెస్ ప్రదర్శన జరిగింది. దీనికి 130 మంది విద్యార్థులు ప్రాజెక్టుల రిజిస్టర్ చేసుకున్నారు. వివిధ ప్రాజెక్టులను ప్రదర్శించారు. వాతావరణ సమస్యల పైన జీవ వైవిధ్యము వ్యక్తిగత సమస్యలు, అలాగే బయో ఎంజైమ్స్ పిసిఒడిలాంటి సమస్యల పైన విద్యార్థులు ప్రాజెక్టులను రూపొందించడం జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి వై తిరుపతిరావు హాజరై మాట్లాడుతూ ఎల్ ని నో వాటి నుండి తట్టుకోవడానికి ప్రాజెక్టులను రూపొందించాలని కోరారు. చుట్టూ ఉన్న సమస్యలే ప్రాజెక్టులుగా రూపొందించుకొన వచ్చునని జిల్లా సైన్స్ అధికారి చాడ జయపాల్ రెడ్డి అభిప్రాయపడ్డారు. జ్యూరీ సభ్యులుగా డాక్టర్ శ్రీనివాస్, మేదం హర్జిత్ కౌర్ , మహేష్ చంద్ర వ్యవహరించారు ఈ కార్యక్రమంలో అక్కడ మీకు మానిటరింగ్ ఆఫీసర్ కర్ర అశోక్ రెడ్డి, సెక్టర్ల అధికారి మిల్కూరి శ్రీనివాస్‌అకాడమీ కోఆర్డినేటర్ పి బీరయ్య, అటల్ టింకరింగ్ ల్యాబ్ ట్రైనర్ కె ఎస్ అనంతాచార్య తదితరులు పాల్గొన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన ఈ ప్రదర్శనలు రాష్ట్రస్థాయిలో ఈ నెల లో జరిగే కార్యక్రమంలో ప్రదర్శించాల్సి ఉంటుంది



ప్రదర్శన ఫలితాలు

బయో ప్లాస్టిక్ తయారీ అంశం పైన పరామిత హై స్కూల్ విద్యార్థులు

సాని నెక్స్ట్... అనే అంశం పైన ఆల్ఫోర్స్ హై స్కూల్ విద్యార్థులు

ద బర్నింగ్ డిసార్డర్ పిసిఒడి

వాణి నికేతన్ హై స్కూల్ విద్యార్థులు

బయోఎంజైమ్ క్లీనర్ ఆల్ ఫోర్స్ హై స్కూల్ కరీంనగర్ విద్యార్థులు, ఫ్రమ్ ఇన్సెంటి రిసీవ్ మోడల్ టెక్నాలజీ ది లారెన్ హై స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని సైన్స్ అధికారి చాడా జైపాల్ రెడ్డి తెలిపారు.

అదిలాబాద్ మహా పాదయాత్రలో పాల్గొన్న భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నవీన్ కుమార్

కోరుట్ల నవంబర్ 3 (మనం న్యూస్) : అదిలాబాద్ జిల్లా నిర్మల్ లో బిజెపి ఆధ్వర్యంలో జరుగుతున్న మహా పాదయాత్రలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోరుట్ల నియోజకవర్గ నాయకులు సురభి నవీన్ కుమార్ వారితోపాటు బిజెపి కౌన్సిలర్లు బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సురభి నవీన్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రాబోయేది భారతీయ జనతా పార్టీ ప్రభుత్వమేనని ప్రతి ఒక్క కార్యకర్త ఒక సైనికుడు ఇవ్వాలి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్తకు తాను అండగా ఉంటానని ఎలాంటి కష్టం వచ్చినా తనను సంప్రదించాలని సురభి నవీన్ కుమార్ కార్యకర్తలకు మరో మారు స్పష్టం చేశారు. ఆయన వెంట స్థానిక పలు ప్రాంతాల నుండి వచ్చిన భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో ఉన్నారు.



ఐక్యమత్యమే మహాబలం.. తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీకి సిరిసిల్ల వేదిక!

ఘనంగా ఆవిర్భావ సభ.. నిర్వాహకులు, అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులకు సభ్యుల ప్రత్యేక కృతజ్ఞతలు.

ఆటపాటలతో కళాకారుల సందడి.. పలువురికి ఘన సన్మానాలు.



సిరిసిల్ల, నవంబర్ 03 (మనం ప్రతినిధి):తెలంగాణ జానపద కళాకారుల ఐక్యతకు, కళా వైభవానికి రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం వేదికగా నిలిచింది. తెలుగు ఫోక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సిరిసిల్ల కాలేజ్ గ్రౌండ్ లో అంగరంగ వైభవంగా నిర్వహించిన తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ ఆవిర్భావ సభ నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన కవులు, కళాకారులు, గాయకులు, సినీ రంగానికి చెందిన పలువురు ప్రతినిధులతో సభా ప్రాంగణం సందడిగా మారింది. ఈ సందర్భంగా సిరిసిల్ల మున్సిపల్ చైర్మన్, ఫోక్ సింగర్స్ ఆధ్వర్యంలో జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కళాకారులు తమ తమ ప్రత్యేకతలను చాటుకుంటూ జానపద గీతాలు ఆలపించారు. ఆటపాటలతో సభకు హాజరైన వారిని అలరించారు. కళారంగానికి విశేష సేవలు అందిస్తున్న కళాకారులను గుర్తించి ఘనంగా సన్మానించి గౌరవించారు.

నిర్వాహకులకు సభ్యుల ప్రత్యేక ధన్యవాదాలు.

తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ ఆవిర్భావ సభను ఇంతటి ఘనంగా, విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేసిన వేదిక నిర్వాహకులకు, అధ్యక్షులకు, ప్రధాన కార్యదర్శులకు, కార్యవర్గ సభ్యులకు, ప్రతి ఒక్క సభ్యునికి తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ కళాకారులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. సభ ఏర్పాట్ల నుంచి కార్యక్రమం విజయవంతమయ్యే వరకు ప్రతి ఒక్కరూ చూపిన సహకారం, సమన్వయం, కృషి అభినందనీయమని కొనియాడారు. దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో వివిధ రంగాలకు చెందిన ఫోక్ కళాకారులంతా ఒకే వేదికపైకి వచ్చి ఐక్యంగా ముందుకు సాగడం ఎంతో ఆనందంగా ఉందని సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. కళాకారులందరినీ ఒకే కుటుంబంలా కలిపిన ఈ వేదిక భవిష్యత్తులో మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.

కళాకారుల ఐక్యతే ప్రధాన బలం

ఐక్యమత్యమే మహాబలం అనే నినాదంతో కళాకారులంతా ఇదే ఐక్యతను కొనసాగించాలని, భవిష్యత్తులో మరిన్ని సభలు, సమావేశాలు నిర్వహించుకోవాలని అభిప్రాయపడ్డారు. కళాకారుల హక్కులు, సంక్షేమం, గౌరవం కోసం అందరూ కలిసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు. తెలంగాణ జానపద కళారంగానికి తగిన గుర్తింపు, కళాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం లభించేలా ఐక్యంగా కృషి చేయాలని పేర్కొన్నారు. సిరిసిల్ల వేదికగా జరిగిన ఈ ఆవిర్భావ సభ కళాకారుల్లో నూతన ఉత్సాహాన్ని నింపిందని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ మరోసారి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ సభ్యులు తెలిపారు.

టిఆర్ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా సాజన్



బెల్లంపల్లి,అక్టోబర్ 3, (మనం న్యూస్) : టిఆర్ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా బెల్లంపల్లికి చెందిన సాజన్ ను టిఆర్ఎస్ వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత నియమించడం జరిగింది. తెలంగాణ ఉద్యమ నుంచి ప్రజా జీవితంలో తనదైన ముద్ర వేస్తూ, టిఆర్ఎస్ పార్టీ కోసం అహర్నిశలు పనిచేస్తున్న సాజన్ కు రాష్ట్ర అధికార ప్రతినిధిగా బాధ్యతలు బాధ్యతలు అప్పగించడం జరిగింది. సాజన్ మాట్లాడుతూ తన మీద ఉన్న నమ్మకంతో ఈ పదవిని అప్పగించిన టిఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షురాలు కవితకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రానున్న కాలంలో టిఆర్ఎస్ పార్టీ కోసం అహర్నిశలు పనిచేస్తానని అన్నారు.

ఘోర రోడ్డు ప్రమాదం.. వ్యక్తి కాలు నుజ్జునుజ్జు

జైపూర్, నవంబర్ 3 (మనం న్యూస్): జైపూర్ మండలం ఇందారం సమీపంలో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఇందారం మైన్స్ క్రాస్ రోడ్డు వద్ద ద్విచక్ర వాహనాన్ని లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది.స్థానికుల కథనం ప్రకారం.. బెజ్జాల గ్రామానికి చెందిన ఎన్నమనేని ముత్యంరావు తన ద్విచక్ర వాహనంపై సుందిళ్ల నుంచి బెజ్జాలకు వస్తున్న క్రమంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ముత్యంరావు కాలు లారీ చక్రాల కింద పడి నుజ్జునుజ్జయింది. తీవ్రంగా గాయపడిన ఆయనను స్థానికులు వెంటనే అప్రమత్తమై చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

సమగ్ర గ్రామీణ అభివృద్ధికి కృషి చేయాలి....

ప్రభుత్వ భవనాలు ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలి....

ఇందిరమ్మ ఫేస్-2 ప్రక్రియ వేగవంతం చేయాలి...

జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా...



కరీంనగర్ నవంబర్ 03(మనం బ్యూరో)...సమగ్ర గ్రామీణ అభివృద్ధికి ఎంపీడీవోలు సహా ఇతర శాఖల అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు.ప్రభుత్వ భవనాల నిర్మాణం, చేయూత పింఛన్లు, ఇందిరమ్మ ఇండ్లు, గ్రామీణాభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రగతిపై జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీవోలు, హౌసింగ్ ఏఈ లు డి ఇ లు, ఇతర శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ ఈనెల 19న రాష్ట్ర ప్రభుత్వం పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్న నేపథ్యంలో జిల్లాలో మహిళా సమాఖ్య, గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ కేంద్రాలు, అదనపు తరగతి గదులు వంటి తుది దశలో ఉన్న నిర్మాణాలను వెంటనే పూర్తి చేసి ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని అన్నారు. రెండవ విడత ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ప్రగతిపై సమీక్షించారు. రెండవ దశలో అర్హులైన లబ్ధిదారులకు మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి ఇందిరమ్మ ఇంటికీ వ్యక్తిగత మరుగుదొడ్ల మంజూరీ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ కొత్త చేయూత పెన్షన్ అందేలా దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు.జాతీయ కుటుంబ సహాయ పథకం కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, అర్హులైన లబ్ధిదారులకు తక్షణమే ఆమోదం తెలపాలని అధికారులకు సూచించారు.

విబీ జిరాంజీ పనులను ముమ్మరం చేయాలని, కూలీల హాజరు శాతాన్ని గణనీయంగా పెంచేలా ప్రణాళికలు రూపొందించాలని స్పష్టం చేశారు. సర్పంచ్, ఇతర ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ఎంపీడీవోలు ప్రతిరోజు విధిగా గ్రామాలను సందర్శించాలని, స్థానిక సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని ఆదేశించారు. తద్వారా ప్రజలకు మండల స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి రావాల్సిన అవసరం ఉండదని పేర్కొన్నారు. జలసిరి కార్యక్రమంలో భాగంగా ఇంటి వద్ద ఇంకుడు గుంతలను, పొలాల వద్ద కుంటలను నిర్మించుకునేలా ప్రజలను ప్రోత్సహించాలని సూచించారు. అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ జిల్లాలో వీలైనని ఎక్కువ సంఖ్యలో ప్రభుత్వ భవనాలను ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం అయ్యేలా చూడాలని, ఇంకుడు గుంతలు ఎక్కువ సంఖ్యలో నిర్మించాలని తెలిపారు. ఈ సమావేశంలో హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సుదర్శన్, డి ఆర్ డి ఓ గీత, జడ్పీ సీఈవో శ్రీనివాస్, డిప్యూటీ సీఈవో రాము, పంచాయతీ రాజ్ ఈఈ, డిపిఓ జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

జడ్.పి.హెచ్.ఎస్ 2008 బ్యాచ్ ఆత్మీయ కలయిక

మల్యాల, నవంబర్ 03,(మనం న్యూస్) : మల్యాల మండల కేంద్రంలోని జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాల 2008 బ్యాచ్ పూర్వ విద్యార్థుల గెట్ టుగెదర్ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తమ పాఠశాల రోజులను గుర్తుచేసుకుంటూ, తమ గురువులను స్మరించుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను, అల్లరి పనులను నెమరువేసుకుంటూ సంతోషంగా గడిపారు. 17 సంవత్సరాల తర్వాత కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందని, ఒకరికొకరు కష్టసుఖాలు గురించి చర్చించుకున్నారు. వారు చేసే పనుల గురించి తెలియపరచుకున్నారు .ఇలాంటి ఆత్మీయ కలయికలు ప్రతి సంవత్సరం జరుపుకోవాలని వారు నిర్ణయించుకున్నారు. అనంతరం స్నేహ విందు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో 2008 బ్యాచ్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

